25-04-2025
శుక్రవారం
మల్కాజిగిరి
jayabherinews
JAYABHERIDAILY.COM
ప్రభాత
జయభేరి
తెలుగు దినపత్రిక
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 02 | సంచిక : 212 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
JB జయభేరి



# గులాబీ మాస్ జాతరకు భారీ ఏర్పాట్లు

తెలంగాణలో పార్టీ ఆవిర్భవించి 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రజతోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు బిఆర్ ఎస్ పార్టీ సిద్ధమయ్యింది. వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈనెల 27వ తేది జరగబోయే ఈ సభకు గతంలో ఎన్నడూ లేనివిధంగా జన సమీకరణ చేపట్టింది. అందుకే అదేస్థాయిలో ఏర్పాట్లను సైతం చేస్తోంది గులాబీ దళం. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటే లక్ష్యంగా 25ఏళ్ల క్రింత ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్ర సమతి (టిఆర్ ఎస్), రాష్ట్ర ఏర్పాటులో కీలకపాత్ర పోషించడంతోపాటు దాదాపు దశాబ్దకాలం నూతన రాష్ట్రాన్ని పాలించి చరిత్ర సృష్టించింది.

**జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 24:**

దేశ రాజకీయాల్లోచక్రం తిప్పాలనే వ్యూహంతో టీఆర్ఎస్ పేరును బీఆర్ఎస్ గా మార్చుకున్న గులాబీపార్టీకి అధికారం దూరమైంది. ఇప్పుడు ఏర్పాటు చేయబోతున్న ఈ భారీ సభ అత్యంత కీలకంగా మారింది. ఓటమి తరువాత ప్రజా సమస్యలపై విమర్శలకు కాస్త గ్యాప్ తీసుకున్న కేసీఆర్, వరంగల్ రజతోత్సవంలో మరోసారి తన మార్క్ వ్యూహాత్మక రాజకీయ విమర్శలతో అధికారపార్టీకి చుక్కలు చూపించేందుకు సిద్ధమైంది. వరంగల్ లో ఈనెల 27వ తేది జరగనున్న వేడకులకు గులాబీ శ్రేణులు ఆశగా ఎదురు చూస్తున్నాయి. తెలంగాణవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి పది లక్షల మందికి తక్కువ కాకుండా సభకు తరలించేందుకు బిఆర్ ఎస్ కార్యకర్తలు నిర్విరామంగా శ్రమిస్తున్నారు. ఇప్పటికే ఇంటింటికీ కరపత్రాలు పంచుతూ, బొట్టుపెట్టి మరీ వరంగల్ సభకు రావాలంటూ ఆహ్వానిస్తున్నారు. 1213 ఎకరాల్లో సభా ప్రాంగణం సిద్దం చేశారు. లక్షలాదిగా జనం హారైనప్పటికీ ఎవరెక్కడ కూర్చున్నా వేదికపై జరుగుతున్న వేడుకలు, కేసీఆర్ ప్రసంగం సభాప్రాంగణం మొత్తం క్లారిటీగా కనిపించే విధంగా ఎల్ ఈడీ స్క్రీన్ లు ఏర్పాటు చేశారు.

...మిగతాది 2 లో

# జమ్మూకశ్మీర్‌లో జల్లెడ పడుతున్న సైన్యం



**జయభేరి, శ్రీనగర్, ఏప్రిల్ 24:**

పహల్గాం దాడికి పాల్పడిన ఉగ్రవాదుల కోసం సైన్యం వేట కొనసాగిస్తోంది. జమ్మూ కశ్మీర్‌లో అణువణువూ గాలిస్తున్నారు. అనుమానితులను అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు. ఈ క్రమంలో దేశంలోని పలు ప్రాంతాల్లో అధికారులు హై అలర్ట్ ప్రకటించారు. విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. మరోవైపు తదుపరి చర్యలు తీసుకునేందుకు కేంద్ర హోంశాఖ కూడా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తోంది. 26మంది పర్యాటకులను పొట్టన పెట్టుకున్న ఉగ్రమూకలను మట్టుబెట్టేందుకు సైన్యం వేట సాగిస్తోంది. లోయలోని అనుమానిత ప్రాంతాలను జల్లెడపడుతోంది. పహల్గాం దాడిని సీరియస్‌గా తీసుకున్న కేంద్రం సైన్యానికి పూర్తి స్వేచ్ఛనిచ్చింది. దాడి జరిగిన క్షణం నుంచి వందల మందిని సైన్యం అదుపులోకి తీసుకుంది. జమ్మూకశ్మీర్ పోలీసులు, సైన్యం కలిసి ఆపరేషన్ ఏరివేత చేపట్టారు. బోర్డర్‌లో భద్రత మరింత కట్టుదిట్టం చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిఘా పెట్టారు. ఇటు చీమ అటు వెళ్లినా తెలిసేలా డేగ కళ్లతో పహారా కాస్తున్నారు. ఇలాంటి ఉద్రిక్తత పరిస్థితుల సమయంలో కూడా కొందరు ఉగ్రవాదులు పాకిస్థాన్ నుంచి భారత్‌లోకి వచ్చేందుకు ప్రయత్నించారు. అలా వచ్చిన ఉగ్రవాదులను భారత్ సైన్యం తుపాకీగుళ్లతో గతం పలికింది. బోర్డర్‌లోనే వాళ్లను మట్టుబెట్టి వారి వద్ద నుంచి పాకిస్థాన్‌కు చెందిన కరెన్సీ, మారణాయుధాలు స్వాధీనం చేసుకుంది. ఇలాంటివి మరిన్ని జరగొచ్చనే అంచనాలతో పూర్తి అలర్ట్‌గా

...మిగతాది 2 లో

# రేవంత్ పాలనలో పంచాయతీరాజ్ వ్యవస్థ నిర్వీర్యం

- కేటీఆర్ విసుర్లు

**జయభేరి, హైదరాబాద్ :**



పదేళ్ల పాలనలో ఉద్యమ నినాదాలను నిజం చేయడమే కాదు గ్రామ స్వరాజ్యం కోసం జాతిపిత మహాత్మగాంధీ కన్న కలలను తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సాకారం చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు వెల్లడించారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం జరుపుకుంటున్న వేళ, పల్లెసీమలే దేశానికి పట్టుగొమ్మలన్న మహాత్మా గాంధీ ఆశయాలే స్ఫూర్తిగా బీఆర్ఎస్ పాలనలో ప్రాణం పోసిన, పల్లెప్రగతి ని గుర్తుచేసుకోవాల్సిన సందర్భమిది అని తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా కేటీఆర్ ట్వీట్ చేశారు. సమైక్యపాలనలో దశాబ్దాల పాటు దగాపడ్డ పల్లెలను దర్జాగా కాలర్ ఎగరేసుకునే స్థాయికి తీర్చిదిద్దిన సందర్భాలు అపూర్వం, అనితర సాధ్యమని మాజీ మంత్రి కేటీఆర్ అభివర్ణించారు.

**కేసీఆర్ హయాంలో ప్రతి పల్లెసీమ ప్రగతిసీమగా మారాయి**

సమస్యల సుడిగుండంలో విలవిలలాడిన ప్రతి పల్లె నాడు సకల సౌకర్యాల హరివిల్లైందని మాజీ మంత్రి కేటీఆర్ గుర్తుచేసుకున్నారు. కేసీఆర్ సంకల్పంతో ప్రతి పల్లెసీమ ప్రగతిసీమగా మారిందని కొనియాడారు. ప్రతి పల్లెలో డంప్

...మిగతాది 2 లో



# కర్రెగుట్టలో భారీ ఎన్కౌంటర్

**జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 24**

తెలంగాణ, ఛత్తీస్‌గడ్, మహారాష్ట్రకు సరిహద్దుగా ఉన్న కర్రెగుట్టలో భారీ ఎన్కౌంటర్ జరిగింది. కేంద్రబలగాలు,మావోయిస్టుల మధ్య కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందినట్టు తెలుస్తోంది. దీన్ని అధికారులు ఇంకా ధ్రువీకరించాల్సి ఉంది. ఇక్కడ కీలకమైన మావోయిస్టు అగ్రనేతలు తలదాచుకున్నారనే సమాచారంతో భద్రతా దళాలు నిఘా పెట్టి ఆ ప్రాంతాన్ని ఆధీనంలోకి తీసుకున్నారు. తెలంగాణ,

...మిగతాది 2 లో



2 లో

# ఉగ్రదాడి ఘటనను భారత్ ఎన్నటికీ క్షమించదు

- ఇది పర్యాటకులపై జరిగిన దాడి కాదు.. దేశం పై జరిగిన దాడి.
- ఉగ్రవాదులను వదిలిపెట్టేది లేదు.. కలలో కూడా ఊహించని రీతిలో ప్రతి ఒక్కరినీ వేటాడి శిక్షిస్తాం.
- ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హెచ్చరిక

# రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

- ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**జయభేరి, జయశంకర్ భూపాలపల్లి :**



రైతులెవరూ దళారులను నమ్మి మోసపోవద్దని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు రైతులకు సూచించారు. గురువారం భూపాలపల్లి నియోజకవర్గం గణపురం మండల కేంద్రంతో పాటు రవినగర్(జంగుపల్లి), గొల్లపల్లి గ్రామాలల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు. రైతులు మద్దతు ధర పొందాలంటే ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకే వరి ధాన్యాన్ని తీసుకురావాలన్నారు. దళారులను నమ్మి మోసపోకుండా జాగ్రత్తపడాలని రైతులకు సూచించారు. ధాన్యం తీసుకురాబోతున్న రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే అక్కడున్న వివిధ శాఖల అధికారులకు ఆదేశించారు. కొనుగోలు ప్రక్రియ సాఫీగా సాగేలా అధికారులు ప్రతిరోజూ పర్యవేక్షణ చేయాలని తెలిపారు. అదేవిధంగా, గత ప్రభుత్వంలో దళితులకు మూడెకరాల భూమి, దళితుడిని సీఎం చేస్తానని, ఇంటికో ఉద్యోగం ఇస్తానని.. ఇలాంటి అనేక హామీలను ఇచ్చి పదేళ్లు ప్రజలను మోసం చేసిందని ఎద్దేవా చేశారు. ఇంతకీ ఇరవై ఐదేళ్ల ఉత్సవాలు టీఆర్ఎస్ పార్టీకా? తెలంగాణ పదాన్ని తీసేసిన బీఆర్ఎస్ పార్టీకా? అని ఎమ్మెల్యే సూటిగా ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ నేతలు, వివిధ శాఖల అధికారులు, కార్యకర్తలు, రైతులు, గ్రామస్తులు ఉన్నారు.



# పహల్గామ్ ఉగ్రదాడి మృతులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళ్ళు

**జయభేరి, హైదరాబాద్ ఏప్రిల్ 24 :**

పహల్గామ్ ఉగ్రదాడి మృతులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులర్పించారు. ఉగ్రవాదుల కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మశాంతి కోసం బంజారాహిల్స్ కమాండ్ కంట్రోల్ సెంటర్ లో గురువారం సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, ఎఐసిసి ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్, టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, పలువురు మంత్రులు, ఎంపిలు రెండు నిమిషాల మౌనం పాటించారు. ఈ ఉగ్రదాడిలో 28 పర్యాటకులు ప్రాణాలు కోల్పోగా.. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. కాగా, జపాన్ పర్యటన ముగించుకుని నిన్న సిఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్ చేరుకున్నారు.



2 లో

# స్థానిక సంస్థలు స్థానిక ప్రభుత్వాలుగా మారాలి

- రాజకీయాలకు అతీతంగా పంచాయతీలకు నేరుగా నిధులు
- ఉపాధి కూలీలను ఇక మీదట ఉపాధి శ్రామికులుగా పిలుద్దాం
- మంగళ గిరిలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవంలో పాల్గొని, దిశానిర్దేశం చేసిన ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి పవన్ కళ్యాణ్

▶▶ మొదటిపేజీ తరువాయి

## గులాబీ మాస్ జాతరకు భారీ ఏర్పాట్లు

ఎండలు దంచికొడుతున్న వేళ సభా ప్రాంగణం మొత్తం చల్లటి వాతావరణం ఉండేలా టెంట్లు, కూలర్లతోపాటు అత్యాధునిక టెక్నాలజీని వాడిని ఎండవేడి నుంచి కార్యకర్తలకు రక్షణ కల్పించేలా సర్వం సిద్ధం చేశారు. ఇదిలా ఉంటే ఉదయం నుంచి సాయంత్రం వరకూ వేడుకలు జరిగే అవకాశం ఉండటంతో ఎండ వేడిని తట్టుకునేందుకు 10లక్షల మజ్జిన ప్యాకెట్లు పంచేందేందుకు ఏర్పాట్లు చేశారు. తాగునీటికి సమస్య లేకుండా ఏకంగా 10లక్షల వాటర్ బాటిల్స్ తెప్పించారు.

ఇంకా అవసరమైతే వాటర్ బాటిల్స్ తెచ్చేందుకు గులాబీ టీమ్ సిద్ధమైంది. బీఆర్ఎస్ రజతోత్సవం కోసం తెలంగాణ నలుమూలల నుంచి వేలాదిగా వాహనాలు తరలి వస్తాయి అందుకే పార్కింగ్ సమస్య తలెత్తకుండా ఏకంగా పార్కింగ్ కోసం వెయ్యి ఎకరాలు కేటాయించారు. వాహనాలు పార్కింగ్ చేసుకుని, నేరుగా సభా ప్రాంగణం వద్దకు చేరుకునేలా, తొక్కిసలాటకు అవకాశం లేకుండా భారీ కేడ్లను ఏర్పాటు చేశారు. ఒకేసారి వేదికపై 500 మంది బీఆర్ ఎస్ నాయకులు కూర్చునేలా అత్యంత భారీ ఏర్పాట్లు సిద్ధం చేశారు. కేసీఆర్ , కేటీఆర్ లతో సెల్ఫీలు దిగే ముచ్చట తీర్చేందుకు ప్రత్యేకంగా సభా ప్రాంగణంలో సెల్ఫీ బోర్డులు ఏర్పాటు చేశారు. విద్యుత్ కోతల ప్రభావం ఈ ప్రభుత్వంలో ఎక్కువగా ఉందని , తమకు విద్యుత్ సరఫరా పై నమ్మకంలేదంటూ ఏకంగా 200 జనరేటర్లను సిద్ధం చేశారు. అనారోగ్య సమస్యలు, వడదెబ్బ వంటివి తలెత్తినప్పుడు వెంటనే వైద్య సదుపాయం అందించేందు 100కి పైగా వైద్య బృందాలను సభప్రారంగణంలో అందుబాటులో ఉంచారు.

అత్యవసర సమయంలో వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించేందకు 20 అంబులెన్స్ లు సైతం ఏర్పాటు చేశారు. తాత్కాలిక టాయిలెట్స్, సభకు వచ్చేవారికి ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసుకునేందుకు 2వేలమంది వాలంటీర్లను అందుబాటులో ఉంచారు. ఇలా చెప్పుకుంటే పోతే బీఆర్ ఎస్ రజతోత్సవాన్ని ఓ మహాజాతరలా జరిపేందుకు గులాబీ దళం సన్నద్ధమైంది.

## జల్లెడ పడుతున్న సైన్యం

సైన్యం ఉంది. గురువారం జమ్మూకశ్మీర్‌లోని ఉధంపూర్‌లో ఉగ్రవాదులకు భద్రతా దళాలకు మధ్య భీకర కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో ఒక ఆర్మీ జవాన్ అమరుడయ్యాడు. బసంత్‌గఢ్‌లో జమ్మూ కాశ్మీర్ పోలీసులతో కలిసి సైన్యం సంయుక్తంగా ఆపరేషన్ ప్రారంభించింది. ఉగ్రవాదులు ఉన్నారనే సమాచారంతో ఓ ప్రాంతంలో ఎటాక్ చేసింది. ఈ టైంలో జరిగిన కాల్పుల్లో జవాన్ అమరుడైనట్టు సైన్యం ప్రకటించింది. దేశంలోని ప్రధాన నగరాలు, పట్టణాలు, ఆధ్యాత్మిక కేంద్రాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. వచ్చే ప్రజలను ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. అన్ని భద్రతా విభాగాలను అప్రత్తమం చేశారు. వచ్చే పోయే వారిపై గట్టి నిఘా పెట్టాలని సూచిస్తున్నారు. బస్‌స్టేషన్లు, ఎయిర్‌పోర్టులు, రైల్వే స్టేషన్ల వద్ద కూడా భద్రత పెంచారు.

హైదరాబాద్, తిరుపతి, ముంబై, చెన్నై ఇలా అన్ని ప్రాంతాల్లో తనిఖీలు సాగుతున్నాయి. ఉగ్రదాడిలో దోషిగా నిలబడ్డ పాకిస్థాన్‌ను ఒంటరిని చేసేందుకు కేంద్రం మరిన్ని చర్యలు సిద్ధమవుతోంది. ఇప్పటికే సింధు జలాల ఒప్పందం రద్దు లాంటి బోల్డ్ స్టెప్ తీసుకుంది. భారత్ తీసుకున్న మరో ఐదు కీలక నిర్ణయాలు పాకిస్థాన్‌కు ఊపిరి ఆడనీయకుండా చేస్తున్నాయి. ఇప్పుడు ఢిల్లీలోని పాకిస్తాన్ అత్యున్నత దౌత్యవేత్త సాద్ అహ్మద్ వారాయిచ్‌కు సమన్లు జారీ చేసింది. పర్సోనా నాన్ గ్రాటా నోట్‌ను అందజేసింది. 48 గంటల్లోనే దేశం విడిచి పెట్టి వెళ్లిపోవాలని మర్యాదగా చెప్పింది. ఓవైపు చర్యలు తీసుకుంటూనే దేశ భద్రత విషయంలో చేపట్టాల్సిన చర్యలపై కేంద్ర హోంశాఖ చర్చలు జరుపుతోంది. భద్రతా విభాగాలు, రా చీఫ్, ఇతర ముఖ్యులతో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా సమావేశమయ్యారు. ఇంకోవైపు అఖిలపక్ష సమావేశం కూడా జరుగుతోంది. అటు జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా కూడా అఖిలపక్ష సమావేశానికి పిలుపునిచ్చారు. ఈ సమావేశాల తర్వాత మరిన్ని కీలక నిర్ణయాలు వెల్లడి అయ్యే అవకాశం ఉంది.

## కర్రెగుట్టలో భారీ ఎన్కౌంటర్

ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రకు సరిహద్దుగా ఉన్న వెంకటాపురం, వాజేడు ఏజెన్సీ ఇప్పుడు భద్రతాబలగాల ఆధీనంలోకి వెళ్లిపోయింది. చాలా కాలంగా ఈ కర్రెగుట్టపై ల్యాండ్‌మైన్స్ పేలుతున్నాయి. ఆ ప్రాంతానికి వెళ్లాలంటేనే భద్రతా బలగాలు భయపడే పరిస్థితికి వచ్చింది. వ్యూహం మార్చిన భద్రతా దళాలు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టాయి.

వెంకటాపురం మండలంలోని గుట్ట సమీపంలో ఉండే గ్రామాల్లోకకి బలగాలు చేరుకున్నాయి.ఆపరేషన్ కగార్‌లో భాగంగా భద్రతాదళాలు రెండు రోజుల నుంచి కర్రెగుట్ట లోపలికి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఇక్కడ హిడ్మా మడవి దళం సభ్యులు ఉన్నారని సమాచారం తెలుసుకున్న అధికారులు కూంబింగ్ నిర్వహించారు. కోబ్రా, డిఆర్జి,బస్టర్ ఫైటర్స్ అందరూ ఇక్కడ మాటు వేసి ఈ ప్రాంతాన్ని పూర్తిగా అష్టదిగ్బంధం చేశారు. ఈ కర్రెగుట్ట వైపునకు బలగాలు రాకుండా ఉండేందుకు మావోయిస్టులు చుట్టుపక్కల మందుపాత్రలు పెట్టారు. ఇవి తరచూ పేలుతున్న ఘటనలు చూసిన బలగాలు వాటిని నిర్వీర్యం చేస్తూ ముందుకు సాగుతున్నాయి. రోజుల తరబడి ఇక్కడ ఆపరేషన్‌లో ఉన్న సిబ్బందికి హెలికాప్టర్ ద్వారా ఫుడ్, వాటర్, మెడిసన్ సప్లై చేస్తున్నారు. ఈ ప్రాంతంలోనే చాలా మంది మావోయిస్టులు తలదాచుకుంటున్నారని సమాచారం అందుతోంది. అందుకే పూర్తిగా ఆ ప్రాంతాన్ని ఆధీనంలోకి తీసుకోవాలని పంతంతో భద్రతా దళాలు ఆపరేషన్ సాగిస్తున్నాయి.

కర్రెగుట్టలో మావోయిస్టులు ఉన్నారనే సమాచారాన్ని ముందుగానే తెలుసుకున్న బలగాలు అటుగా ఎవర్నీ వెళ్లనీయకుండా కట్టడి చేశారు. మావోయిస్టులకు మందులు, నీళ్లు, ఆహారం సరఫరా కాకుండా చేశారు. దాదాపు ఐదారు రాష్ట్రాల నుంచి బలగాలు ఈ ఆపరేషన్‌లో పని చేస్తున్నాయి. భారీ సంఖ్యలో బలగాలు అన్ని వైపుల నుంచి చుట్టు ముడితే తప్పించుకునే మార్గం మావోయిస్టులకు లేదని అధికారులు భావిస్తున్నారు. మరికొన్ని గంటల్లోనే కర్రెగుట్టలో ఉన్న మావోయిస్టుల వద్దకు చేరుకుంటామని అధికారులు చెబుతున్నారు.

## పంచాయతీరాజ్ వ్యవస్థ నిర్వీర్యం

యార్డు తప్ప చెత్త కంపు లేని పరిస్థితి ఉందని చెప్పారు. కూలిపోయే స్థితి ఉన్న ఖాళీ ఇళ్ల కిరికిరి నుంచి పొంగిపొర్లే మురుగు కాల్వల శుభ్రత వరకూ ప్రతి సమస్యకు పదేళ్ల పాలనలో శాశ్వత పరిష్కారం చూపామని అన్నారు. కలుషిత నీటి కలకలం లేకుండా, సీజనల్ రోగాల చింతన లేకుండా సాగిన పంచాయతీల ప్రస్థానం గ్రామస్వరాజ్యంలో ఓ స్వర్ణయుగమని తెలిపారు. పచ్చదనానికి కొదవ లేకుండా, నిధులకు కొరత లేకుండా, విధులకు ఆటంకం లేకుండా, ప్రతి గ్రామాన్ని మెరుగైన జీవనానికి మారుపేరుగా మార్చారని. ఇది కేసీఆర్ విజన్ అని మాజీ మంత్రి కేటీఆర్ ఉద్ఘాటించారు.

**గ్రామాల్లో కనీస వసతులు కరువు,**

దేశంలో మూడు శాతం జనాభా ఉన్న తెలంగాణ పల్లెప్రగతిలో 30 శాతం అవార్డులను గెలుచుకోవడం పల్లె ప్రగతిలో భాగస్వాములైన ప్రతి ఒక్కరి విజయమని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. నాడు పదేళ్లపాటు మురిసిన పల్లె, కాంగ్రెస్ పాలనలో నేడు మళ్లీ కన్నీరు పెడుతోందని ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ పాలనలో గ్రామస్వరాజ్యం పూర్తిగా గాడితప్పిందని విమర్శించారు. ఏడాదిన్నర గడిచినా స్థానిక సంస్థలకు ఎన్నికలు లేవని చెప్పారు. 15వ ఆర్థిక సంఘం నిధులు లేవని అన్నారు.

గ్రామాల్లో కనీస వసతులు లేవన్నారు. పల్లెప్రజలకు గుక్కెడు మంచినీళ్లు దిక్కు లేవని చెప్పారు. చివరికి పంచాయతీ సిబ్బందికి వేతనాలు లేవు. ఉపాధి హామీ కూలీలకు పనిదినాలు లేవు, మాజీ సర్పంచ్‌ల బిల్లులకే మోక్షం లేదని అన్నారు. దేశంలోనే ఆదర్శ గ్రామాలకు చిరునామాగా నిలిచిన తెలంగాణ పల్లెలు అధ్వాన పరిస్థితులకు అడ్రస్‌గా మారడం అత్యంత బాధాకరమని చెప్పుకొచ్చారు. ఢిల్లీ పార్టీలను నమ్మిన పాపానికి పంచాయతీరాజ్ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసిన తీరును తెలంగాణ పల్లె ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉండి తీవ్ర అన్యాయం చేస్తున్న బీజేపీకి, పచ్చని పల్లెలను సంక్షోభంలోకి నెట్టిన కాంగ్రెస్ పార్టీకి కర్రుగాల్చి వాత పెడతారని మాజీ మంత్రి కేటీఆర్ హెచ్చరించారు.

# భారత్ యాక్షన్ షురూ

**కశ్మీర్ లోని పెహల్ గాంలో చోటుచేసుకున్న ఉగ్రవాద దాడి నేపథ్యంలో భారత ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. కశ్మీర్ లోని పర్యాటకులను లక్ష్యంగా చేసుకుని జరిగిన ఉగ్రదాడి వెనుక దాయాదీ దేశం పాకిస్తాన్ హస్తం ఉందని నిర్ధారించిన భారత్... పాక్ తో సంబంధాలను పూర్తిగా నిలిపివేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో బుధవారం జరిగిన భద్రతపై కేబినెట్ కమిటీ భేటీలో కేంద్రం ఈ నిర్ణయాన్ని తీసుకుంది.**



ఈ నిర్ణయంతో పాక్ తో భారత్ సంబంధాలు పూర్తిగా రద్దు అవుతాయి. పాక్ పౌరులను ఏ రకంగానూ భారత్ లోకి అనుమతించరు. అంతేకాకుండా పాక్ తో దౌత్యపరమైన సంబంధాలు కూడా పూర్తిగా నిలిచిపోనున్నాయి. భద్రతపై కేబినెట్ కమిటీ భేటీ ముగిసిన వెంటనే కేంద్రం తీసుకున్న నిర్ణయాలను భారత విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ వెల్లడించారు. ప్రస్తుతం భారత్ లో ఉన్న పాక్ పర్యాటకులతో పాటు ఇతరత్రా పనుల నిమిత్తం భారత్ వచ్చిన ఆ దేశ పౌరులు భారత్ ను వీడేందుకు కేవలం 48 గంటల వ్యవధిని ఇస్తున్నట్లు మిస్రీ తేల్చి చెప్పారు. అంటే.. గురు, శుక్రవారా ల్లోగా పాక్ పౌరులు భారత్ ను వీడాల్సి ఉంటుంది. ఇకపై భారత్ లోకి పాక్ పర్యాటకులను గానీ, ఇతరత్రా ఏ కారణాలతో అయినా గానీ ఆ దేశ పౌరులను అనుమతించేది లేదని కూడా తేల్చి చెప్పారు. అంతేకాకుండా భారత్ లోని పాక్ హై కమిషనర్ ను దేశం వదిలి వెళ్లిపోవాల్సింది ఇప్పటికే ఆదేశాలు జారీ అయ్యాయి. పాక్ ఇప్పటిదాకా కొనసాగుతున్న భారత సంబంధాలు పూర్తిగా స్తంభించనున్నాయి. ఇరు దేశాల మధ్య ఉన్న అటారీవాఘా సరిహద్దును తక్షణమే మూసివేస్తున్నట్లుగా మిస్రీ వెల్లడించారు. అంతేకాకుండా ఇరు దేశాల మధ్య అమలు అవుతున్న సింధూ జలాల ఒప్పందాన్ని కూడా తక్షణమే నిలిపివేస్తున్నట్లుగా కూడా కేంద్రం నిర్ణయం తీసుకుందని ఆయన ప్రకటించారు. జమ్మూ కశ్మీర్ లో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడి వెనుక పాకిస్తాన్ ఉందని భారత్ నిర్ధారణకు వచ్చింది. ఆదేశంపై కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. క్యాబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఉగ్రదాడి వెనుక పాకిస్తాన్ హస్తం ఉందన్న దానికి తమ వద్ద పూర్తి ఆధారాలు ఉన్నాయని కేంద్రం ప్రకటించింది. 1960లో ఒప్పందం చేసుకున్న సింధు నదీ జలాల ఒప్పందాన్ని భారత్ తాత్కాలికంగా నిలిపివేసింది. పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడం వల్ల ఈ చర్య తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఇస్లామాబాద్‌లోని భారతీయ హైకమిషన్‌ను మూసివేయాలని నిర్ణయించారు, అలాగే పాకిస్తాన్ నుంచి భారత దౌత్యవేత్తలను వెనక్కి రప్పించాలని నిర్ణయించారు. భారత్‌లో ఉన్న పాకిస్తాన్ సైనిక సలహాదారులను "పర్సోనా నాన్ గ్రాటా" గా ప్రకటించారు, వారిని దేశం విడిచి వెళ్లమని ఆదేశించారు.పాకిస్తాన్‌తో అన్ని నయతంత్ర సంబంధాలను తెంచుకునే దిశగా పరిశీలన చేస్తున్నారు. పాక్ హైకమిషనర్‌ను ఇండియా నుంచి పంపించేయాలని నిర్ణయించారు. పెహల్ గాం ఉగ్రదాడి పాక్ ప్రేరేపిత ఉగ్రవాదుల మార్గదర్శకత్వంలోనే జరిగిందని, దాడికి పాకిస్తాన్ సైన్యాధిపతి నుంచి కూడా పూర్తిగా సహకారం అందిందన్న ఆధారాలు కూడా లభ్యమయ్యాయి. దీంతోనే ఈ దాడిని ఈజీగా తీసుకోరాదన్న నేపథ్యంలో కేంద్రం కఠిన నిర్ణయాన్ని తీసుకుందన్న వాదనలు వినిపిస్తున్నాయి.పహల్గామ్‌లో జరిగిన దారుణ ఉగ్రదాడి వెనుక ఉన్నది తామేనంటూ ది రెసిస్టెన్స్ ఫ్రంట్ ప్రకటించుకోవడంతో, ఈ సంస్థ మళ్లీ వార్తల్లోకి వచ్చింది. ఈ దాడిలో 25 మందికి పైగా పర్యాటకులు ప్రాణాలు కోల్పోగా, అనేక మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటనతో 'టీఆర్ఎఫ్' గురించి మరోసారి చర్చ మొదలైంది. అసలు ఈ టీఆర్ఎఫ్ ఎవరు? దీని వెనుక ఎలాంటి శక్తులు పనిచేస్తున్నాయి? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.2019 ఆగస్టులో కేంద్రం ఆర్టికల్ 370 రద్దు చేసిన తర్వాత పాక్ ప్రోత్సహంతో ఏర్పాటు చేసిన ఈ సంస్థ, పాకిస్థాన్ ఉగ్రసంస్థ లష్కరే తోయిబాకు అనుబంధంగా పనిచేస్తున్నట్టు గుర్తించారు. ఏర్పడిన తక్కువ సమయంలోనే ఈ సంస్థ కశ్మీర్ లో తన ఉనికిని చాటుకుంది. హిజ్బుల్ ముజాహిదీన్, జైషే మహ్మద్ లాంటి ఉగ్ర సంస్థల సభ్యులను టీఆర్ఎఫ్‌లో చేర్చుకుని, దాడులకు సరికొత్త వ్యూహాలను రచించింది. భారత హోంమంత్రిత్వ శాఖ 2023 జనవరిలో ఈ సంస్థను చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం ప్రకారం నిషేధించిందిఈ సంస్థకు షేక్ సజ్జాద్ గుల్ సుప్రీం కమాండర్‌గా, బాసిత్ అహ్మద్ దార్ ఆపరేషనల్ చీఫ్‌గా వ్యవహరించారు. ట్రెండింగ్ సోషల్ మీడియాను అడ్డుపెట్టుకుని, ఈ సంస్థ భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీవ్రమైన హింసను రెచ్చగొడుతోంది. కాశ్మీరీ పండిట్లు, స్థానిక పోలీసులు, కార్మికులు, పర్యాటకులు, వ్యాపారస్తులు వంటి సాఫ్ట్ టార్గెట్లను ఎంచుకుని హింసకు పాల్పడుతోంది. తాజాగా పహల్గామ్‌లో జరిగిన దాడి ఈ వ్యూహానికే ఉదాహరణగా చెబుతున్నారు.2018లో ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ పాకిస్థాన్‌ను గ్రే లిస్ట్‌లో పెట్టడంతో, లష్కరే తోయిబా తరఫున పాక్ గూఢచార సంస్థ (ISI) ఈ టీఆర్ఎఫ్‌ను సృష్టించిందని విశ్లేషకులు చెబుతున్నారు. అంతర్జాతీయంగా దృష్టి మరల్చేందుకే కొత్త పేరుతో పాత ఉగ్ర సంస్థలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చి పాక్ ఈ వ్యూహానికి తెరతీసింది. ఈ సంస్థ గతంలో గందర్బల్‌లో ఓ వైద్యుడితో పాటు కార్మికులు సహా ఏడుగురిని పొట్టనబెట్టుకుంది. అంతేకాకుండా 2020లో కుప్వారా సెక్టార్‌లో జరిగిన పోరులో ఐదుగురు భారత జవాన్లు వీరమరణం పొందడం కూడా ఇదే సంస్థ పనే. ప్రస్తుతం అమర్‌నాథ్ యాత్ర నేపథ్యంలో ఈ సంస్థ కార్యకలాపాలపై ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు ప్రత్యేక దృష్టి పెట్టాయి. పహల్గామ్ ఘటన తర్వాత ఈ సంస్థపై మరింత నిఘా పెంచారు. మొత్తం మీద టీఆర్ఎఫ్ సంస్థ కశ్మీర్ లో మరోసారి నెత్తుటి మరకలు చల్లేందుకు సిద్ధపడుతోందన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో టీఆర్ఎఫ్‌పై భద్రతా దళాల పోరాటం మరింత తీవ్రతరం కానుంది.

**2019 ఆగస్టులో కేంద్రం ఆర్టికల్ 370 రద్దు చేసిన తర్వాత పాక్ ప్రోత్సహంతో ఏర్పాటు చేసిన ఈ సంస్థ, పాకిస్థాన్ ఉగ్రసంస్థ లష్కరే తోయిబాకు అనుబంధంగా పనిచేస్తున్నట్టు గుర్తించారు. ఏర్పడిన తక్కువ సమయంలోనే ఈ సంస్థ కశ్మీర్ లో తన ఉనికిని చాటుకుంది. హిజ్బుల్ ముజాహిదీన్, జైషే మహ్మద్ లాంటి ఉగ్ర సంస్థల సభ్యులను టీఆర్ఎఫ్‌లో చేర్చుకుని, దాడులకు సరికొత్త వ్యూహాలను రచించింది. భారత హోంమంత్రిత్వ శాఖ 2023 జనవరిలో ఈ సంస్థను చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం ప్రకారం నిషేధించిందిఈ సంస్థకు షేక్ సజ్జాద్ గుల్ సుప్రీం కమాండర్‌గా, బాసిత్ అహ్మద్ దార్ ఆపరేషనల్ చీఫ్‌గా వ్యవహరించారు.**

## ఉగ్రదాడి ఘటనను భారత్ ఎన్నటికీ క్షమించదు

- **ఇది పర్యాటకులపై జరిగిన దాడి కాదు.. దేశం పై జరిగిన దాడి.**
- **ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హెచ్చరిక**



**జయభేరి, మధుబని :**

జమ్ము కశ్మీర్‌లోని ప్రముఖ పర్యాటక ప్రాంతం పెహల్‌గామ్‌లో ఉగ్రదాడి ఘటనను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తీవ్రంగా ఖండించారు. పెహల్‌గామ్‌లో ఉగ్రవాదులు నరమేధం సృష్టించి.. అమాయకుల ప్రాణాలు తీశారన్నారు. ఈ ఉగ్రదాడిని భారత్ ఎన్నటికీ క్షమించదన్నారు. బీహార్‌లోని మధుబనిలో జరిగిన బహిరంగ సభలో మోదీ ప్రసంగించారు. ఈ సందర్భంగా ఉగ్రదాడి మృతులకు నివాళులర్పించారు. రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.అనంతరం ప్రధాని మోదీ మాట్లాడుతూ.. 'పెహల్‌గామ్‌లో ఉగ్రవాదులు నరమేధం సృష్టించారు. అమాయకుల ప్రాణాలు బలిగొన్నారు. ఇది పర్యాటకులపై జరిగిన దాడి కాదు. దేశంపై జరిగిన దాడి. ఈ దాడిని భారత్ ఎన్నటికీ క్షమించదు. ఉగ్రవాదులను వదిలిపెట్టేది లేదు. కలలో కూడా ఊహించని రీతిలో వారిని శిక్షిస్తాం. దాడికి పాల్పడిన ప్రతి ఒక్కరినీ వేటాడి శిక్షిస్తాం. ఉగ్రవాదాన్ని మట్టిలో కలిపే సమయం ఆసన్నమైంది. దేశ ప్రజలకు మాటిస్తున్నా.. ఈ దాడికి ప్రతీకారం తీర్చుకుంటాం. ఉగ్రనేతలను కూడా విడిచిపెట్టం. ప్రపంచం కూడా మా ప్రతీకారం ఎలా ఉంటుందో చూడబోతోంది' అంటూ ఉగ్రవాదులకు ప్రధాని సీరియస్ వార్నింగ్ ఇచ్చారు.

## స్థానిక సంస్థలు స్థానిక ప్రభుత్వాలుగా మారాలి

- **మంగళగిరిలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవంలో పాల్గొని, దిశానిర్దేశం చేసిన ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి పవన్ కళ్యాణ్**

**జయభేరి, మంగళగిరి :**

'గ్రామ పంచాయతీలు బలంగా ఎదగాలి. ఆర్థిక, సామాజిక, రాజకీయ సమన్వయంతో ఐక్యంగా పని చేయాలి. అన్ని రంగాల్లో స్వయం ప్రతిపత్తిని సాధించాలి. అభివృద్ధి, ఆకాంక్షలు కలగలిపి స్వర్ణ గ్రామాలుగా వెలగాలి' అని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆకాంక్షించారు. పల్లెలే దేశానికి పట్టుగొమ్మలు అన్న మహాత్ముడి మాటకు అనుగుణంగా పల్లెలు జాతీయ సమగ్రతకు, సుస్థిరతకు కూడా మూల కేంద్రాలు కావాలి అన్నారు. స్థానిక సంస్థలు అన్నిరంగాల్లో స్వావలంబన సాధించి స్థానిక ప్రభుత్వాలుగా మారేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, దానికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని భరోసా ఇచ్చారు. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ సెంటర్ లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు.

పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. "నాకు పల్లెలు అంటే ప్రాణం. పల్లెల్లో బతకాలని బలంగా ఉండేది. కానీ సాధ్యపడలేదు. కూటమి ప్రభుత్వంలో చాలా ఇష్టంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలను చేపట్టాను. శాఖలను తీసుకున్న తర్వాత 2 నెలల పాటు సమగ్ర పరిశీలన చేసిన తర్వాత అధికారుల సమావేశంలో నేను చెప్పింది ఒక్కటే.. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల్లో ఏ పనికి ఏ నిధుల కేటాయింపు జరిగిందో అది పక్కాగా దానికే ఖర్చు చేయాలి. పారదర్శకంగా పనులు జరగాలి అని చెప్పాను. ఎలాంటి మళ్లింపులు, వృధా ఖర్చులు లేకుండా పల్లెల్లో సౌకర్యాలు, వసతులు సమకూరాలి అని చెప్పాను. దాని ప్రకారమే ఇప్పుడు పనులు జరుగుతున్నాయి.

**నిబంధనల మేరకు పారదర్శకంగా బదిలీలు**

అలాగే పీఆర్, ఆర్.డి. శాఖల్లోని సిబ్బంది బదిలీలు ఎన్నడూ జరగనంత పారదర్శకంగా జరిపాం. సిఫార్సులకు, అవినీతికి తావు లేకుండా బదిలీలను పక్కాగా జరిపాం. మంత్రులు, ఎమ్మెల్యేల సిఫార్సులు ఉన్నప్పటికీ నిబంధనలను అనుసరించి మాత్రమే బదిలీలు చేశాం. సమర్థత ఉన్నా నిర్లక్ష్యం కాబడిన ఉద్యోగులను, అధికారులకు తగిన సమున్నత అవకాశాలు ఇచ్చేలా ప్రణాళికతో ముందుకు వెళ్లాం. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల్లో సమూల మార్పులు తీసుకొచ్చాం. దీని ఫలితమే సమష్టి కృషితో పనులు పల్లెలలో వేగంగా జరుగుతున్నాయి. దీనిని ముందుకు తీసుకెళ్లడంలో ఎంతో కృషి చేస్తున్న పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్కి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ శ్రీ మైలవరపు కృష్ణ తేజ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నాను. పనులను వేగవంతంగా పూర్తి చేసిన కాంట్రాక్టర్లకు సంబంధించిన బిల్లులు కూడా త్వరలోనే అందుతాయి.



కేంద్రంలో కొన్ని ఆర్థికపరమైన అంశాల వల్ల ఆలస్యం అయింది. అవి త్వరలోనే తీరుతాయి. నాకు పాలనపరమైన అనుభవం లేకున్నా, ప్రజలకు మేలు చేయాలనే త్రికరణ శుద్ధి ఉంది.

**రాజకీయాలకు అతీతంగా నిధులు అందిస్తున్నాం**

గ్రామ పంచాయతీలు గతంలో కులాలు, రాజకీయాలు, వర్గపోరుతో సతమతం అయ్యేవి. దీన్ని క్రమంగా అధిగమిస్తున్నాం. గ్రామ పంచాయతీలకు రాజకీయాలకు అతీతంగా నిధులు అందిస్తున్నాం. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే గ్రామ సర్పంచుల ఆత్మగౌరవం నిలిపేలా జాతీయ పండుగల నిధులను పెంచాం. 70 నుంచి 80 శాతం విపక్ష పార్టీల సర్పంచులు ఉన్నప్పటికీ రూ.100లు ఉన్న నిధుల్ని రూ.10 వేలు, రూ.250 లు ఉన్న పంచాయతీలకు రూ.25 వేలు చేశాం. స్థానిక సంస్థల సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలకు తగిన గౌరవం ఇస్తున్నాం. దాన్ని కొనసాగిస్తాం.

# బయటపడుతున్న
# ఆర్పీల 'లీల'లు @గజ్వేల్





- నెహ్రూ మహిళా సంఘానికి రూ. 20 లక్షల రుణం మంజూరు
- రూ. 14 లక్షల స్వాహా చేసిన ఆర్పి
- తీగ లాగితే డొక్క కదులుతున్న అర్పిల బాగోతం
- జయభేరి ఎఫెక్ట్

**జయభేరి, గజ్వేల్, ఏప్రిల్ 24 :**

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో మెప్మా ఆర్పీల లీలలు ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయి. గజ్వేల్ మెప్మా ఆర్పీలు మహిళా సంఘాల వద్ద డబ్బులు వసూలు చేస్తున్నారన్న వార్తలు గత కొద్దిరోజులుగా దినపత్రికల్లో వస్తున్న విషయం అందరికీ తెలిసిందే. తాజాగా ఆర్పీల దారుణాలు మరిన్ని బయటకు వస్తున్నాయి.

తమకు వచ్చిన రూ.20 లక్షల రుణంలో రూ. 14 లక్షలు అర్పి కృష్ణ లీల, మరో మహిళా సంఘం సభ్యురాలు మంజుల సహకారంతో వాడుకున్నట్లు గురువారం పట్టణానికి చెందిన నెహ్రూ మహిళా సంఘం సభ్యులు మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్యకు ఫిర్యాదు చేశారు. గతంలో కొనసాగిన నెహ్రూ మహిళా సంఘం సభ్యులు అందరూ గ్రూప్ నుండి తొలగిపోగా ఒకరికొకరు పరిచయం లేని పదిమంది సభ్యులను బ్యాంకు అధికారులకు చూపి వారే నెహ్రూ సంఘం సభ్యులని నమ్మించి సంఘానికి రూ. 20 లక్షల రుణాన్ని ఆర్పి మంజూరు చేయించింది. రుణం మంజూరు కి ముందుగానీ, తర్వాత గానీ గ్రూప్ సభ్యులు ఒకరినొకరు కలుసుకోలేదు. కొద్దిరోజుల క్రితం రుణం ఇచ్చిన బ్యాంకు అధికారులు సంఘం సభ్యులకు ఫోన్ చేసి నెలవారి చెల్లింపులు చేయాలని అడిగారు.

దీంతో గ్రూప్ సభ్యులంతా ఒక్కసారిగా షాక్ కు గురయ్యారు. వెంటనే బ్యాంకుకు వెళ్లి అధికారులను అడుగగా, తమ పేరున రూ.20 లక్షలు రుణం మంజూరు చేసినట్లు తెలుసుకొని ఆశ్చర్యపోయారు. తమలో కొందరికి మాత్రమే రూ. లక్ష చొప్పున, మెప్మా సి ఓ సోదరి కి రూ. రెండు లక్షల రుణం మాత్రమే ఇవ్వడం జరిగిందని, మిగతా డబ్బుల విషయం తమకు తెలియదని అధికారుల ముందు ఆవేదన వ్యక్తం చేశారు. ఒకరికొకరు తెలియని మమ్మల్ని ఒక గ్రూప్ గా చేసి రూ. 50వేలు, రూ. లక్ష చొప్పున రుణం ఇస్తామని నమ్మబలికి తమ పేరున 20 లక్షల రుణాన్ని తీసుకొని ఆర్పి తమను మోసం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కూలి పనులు చిన్నపాటి ఉద్యోగాలు చేసుకుంటూ జీవనం వెల్లదీస్తున్న మమ్మల్ని మోసం చేసిన ఆర్పిని ఆమెకు సహకరించిన మరో గ్రూప్ సభ్యురాలు మంజుల నుండి డబ్బులు రికవరీ చేసి బ్యాంకుకు చెల్లించేలా చూడాలని మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్యకు మహిళా సంఘం సభ్యులు ఫిర్యాదు చేశారు.




## మరిడిమాంబ అమ్మవారిని దర్శించుకొన్న ఎమ్మెల్యే పంచకర్ల

**జయభేరి, పరవాడ:**

పెందుర్తి నియోజకవర్గం పరవాడ మండలంలో రావాడ పంచాయతీ జల్లెలపాలెం గ్రామ దేవత మరిడిమాంబ అమ్మవారి పండుగ మహోత్సవ కార్యక్రమంలోనూ మరియు పరవాడ మండలం వెన్నెల పాలెం గ్రామ దేవత దుర్గ మాంబ అమ్మవారి పండుగ మహోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు,తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు బండారు అప్పలనాయుడు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.వీరుతో పాటు పంచకర్ల ప్రసాద్ రావు,మండల పార్టీ అధ్యక్షులు వియ్యపు చిన్న ,బొద్దపు శ్రీనివాస్,మాజీ జెడ్పిటిసి సభ్యులు పైల జగన్నాథ రావు ,మాజీ ఎంపీపీ సభ్యులు మాసరపు అప్పలనాయుడు ,తానాం గ్రామ సర్పంచ్ కన్నూరి రమణ,ముత్యాలంపాలెం సర్పంచ్ చింతకాయల ముత్యాలు , రావాడ గ్రామ సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు , వెన్నెల నర్సింగ్ రావు గారు,దుల్ల రాము నాయుడు ,పిల్ల శివకృష్ణ ,బుగిడి రామ గోవింద్, వగ్రీ పరదేశి నాయుడు, కేవెన్ఆర్, సుందరపు శ్రీనివాస్, పావని మొదలగు జల్లెల పాలెం మరియు వెన్నెల పాలెం గ్రామం స్థానిక నాయకులు మరియు పరవాడ మండలం ఉమ్మడి ఎన్డీఏ మహాకూటమి నాయకులు కార్యకర్తలు మరియు వీర మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వెన్నలపాలెంలో దుర్గమ్మా అమ్మవారిని దర్శించుకొన్న మాడుగుల ఎమ్మెల్యే బండారు



**జయభేరి, పరవాడ:**

పరవాడ మండలం వెన్నలపాలెం గ్రామంలో దుర్గమ్మా అమ్మవారి పండగ సందర్బంగా మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి సతి సమేతంగా కుటుంబ సభ్యులతో విచ్చేసి అమ్మవారిని దర్శించుకొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ అమ్మవారి కృప వలన గ్రామంలో అందరూ ఆరోగ్యంగా ఉండాలని పాడిపంటలు వలన రైతులకి లాభం చేకోరాలని కోరుకొంటున్న తెలియజేసారు.ఎమ్మెల్యే బండారుతో పాటు పెందుర్తి టీడీపీ యువ నాయుకుడు బండారు అప్పలనాయుడు అమ్మవారిని దర్శించుకొన్నారు అదే విధంగా ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయుకులు పయిల రథలు సన్యాసిరావు,ఏకుల అప్పారావు గ్రామ టీడీపీ నాయుకులు అధిక సంఖ్యలో మహిళలు భక్తులు పాల్గొన్నారు.



## రజతోత్సవ సభకు తరలి రావాలి

- బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత, నుతన గౌడ సంఘం స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గుండుకాడి వెంకటేష్ గౌడ్

**జయభేరి, వర్ధల్, ఏప్రిల్ 24 :**

ఈ నెల 27వ వరంగల్ లో నిర్వహించే బీఆర్ఏస్ రజతోత్సవ బహిరంగ సభను జయ ప్రదం చేయాలని, విద్యార్థి, యువజన విభాగం, గౌడ్ సంఘం నాయకులు పెద్ద ఎత్తున తరలి రావాలని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత,శ్రీ నుతన గౌడ సంఘం స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గుండుకాడి వెంకటేష్ గౌడ్ విజ్ఞప్తి చేశారు.వరంగల్ లో నిర్వహించే సభకి విద్యార్థి. యువజన విభాగం, గౌడ సంఘం నాయకులు, అన్ని రంగాల నాయకులు, నేతలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం 15 నెలల పాలన తెలంగాణ రాష్ట్రా నికి శాపంగా మారిందని ఆయన విమ ర్శించారు. ప్రజలకు, విద్యార్థులకిచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు.

## రోడ్డు దాటే క్రమంలో యాక్సిడెంట్ వ్యక్తి మృతి

- శోకసముద్రంలో ఎర్రవల్లి గ్రామం



**జయభేరి, గజ్వేల్, ఏప్రిల్ 24 :**

సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి గ్రామానికి చెందిన చందా గణేష్ యాదవ్(40)గురువారం రోజు సాయంత్రం సింగయపల్లి చౌరస్తా వద్ద రోడ్డు దాటే క్రమంలో వేగంగా వస్తున్న కారు ఢీకొనడం జరిగింది.తలకు బలమైన గాయాలు తగలడంతో ఆర్ వియం హాస్పిటల్ కు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు.మృత్తునికి భార్య ఇద్దరు పిల్లలు కొడుకు కూతురు ఉన్నారు.

## బిజెపి కొవ్వొత్తుల ర్యాలీ

- పర్యాటకుల పై ఉగ్రవాదుల దాడి పిరికి పంద చర్య - విక్రమ్ రెడ్డి, బుద్ధి శ్రీనివాస్

**జయభేరి, ఏప్రిల్ 24:**



జమ్మూ కాశ్మీర్ లోనీ పహల్గామ్ ప్రాంతంలో పర్యాటక యాత్రికులపై జరిగిన ఉగ్ర దాడిని ఖండిస్తూ మేడ్చల్ జిల్లా అలియాబాద్ లో బిజెపి ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మండల బిజెవైఎం అధ్యక్షులు శరత్ కుమార్, నరేష్ యాదవ్ ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా మాజీ అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్, మండల బిజెపి అధ్యక్షుడు కొరివి కృష్ణ ముదిరాజ్ లు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పహల్గామ్ ప్రాంతంలో పర్యాటకులపై ఉగ్ర మూకలు చేసిన దాడిని పిరికి పంద చర్యగా అభివర్ణించారు. అమాయకులను లక్ష్యంగా చేసుకొని దాడులకు పాల్పడటం హేయమైన చర్య అన్నారు. దీనికి వారు తగిన మూల్యం చెల్లించుకుంటారని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో తుంకుంట మున్సిపాలిటీ అధ్యక్షులు పట్నం నరసింహ రెడ్డి , షామీర్ పేట మండల మాజీ అధ్యక్షులు కైరా యాదగిరి, జిల్లా బీజేవైఎం కార్యదర్శి సాయి గౌడ్ , కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి మల్యాల మహేష్ , ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు అల్లం శ్రీనివాస్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు చారి, ఓబీసీ మోర్చా మండల మాజీ అధ్యక్షులు కొంగ బాలకృష్ణ , బూత్ అధ్యక్షులు చిటికుల సత్యం , సంతోష్, శ్రీకాంత్ రెడ్డి, నాయకులు మధుసుదన్ రెడ్డి, సొప్పరి వెంకటేష్, జంగారెడ్డి తుంకుంట నరేందర్ రెడ్డి, సామల నరసింహ, సూర్యం, కుంచె నరసింహ, మల్యాల సత్యనారాయణ, గుండ స్వామి ప్రవీణ్ వెంకటేష్ శ్యామ్ కుమార్ చందు తదితరులు పాల్గొన్నారు.

## బిల్లులు రాక ఆవేదన

- బిల్లులు రాక ఆవేదన వ్యక్తం చేసిన కాంట్రాక్టర్ ఇరగ దిండ్ల కృష్ణ నల్గొండ జిల్లా దేవరకొండ

**జయభేరి, దేవరకొండ :**



కాంట్రాక్టర్లకు అన్యాయం జరిగింది. 25వ తారీకు శుక్రవారం రోజున ప్రగతి భవన్ వద్దకు అందరూ తప్పకుండా అందరూ హాజరు కాగలరు.నల్గొండ జిల్లాలో అన్ని ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్లలో ఆర్ అండ్ బి నీటిపారుదల శాఖ ఎస్ఎల్బీసీ పంచాయితీ రాజ్ ఆర్డబ్ల్యూఎస్ సోషల్ వెల్ఫేర్ ట్రైబల్ వెల్ఫేర్ మున్సిపాలిటీలో మన ఊరు మనబడి ఇంకా అన్ని ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్లలో చిన్నచిన్న కాంట్రాక్టర్లు మధ్యతరగతి కాంట్రాక్టర్లు కాంట్రాక్టు పనులనే నమ్ముకొని వీటి మీద ఆధారపడి లక్షలు వడ్డీకి తెచ్చి జీవనం సాగిస్తున్నారు.ఇలాంటి కాంట్రాక్టర్లకు మార్చి 31 నిరాశ పరిచింది గతంలో ఉన్న ప్రభుత్వాలు మార్చి 31 బడ్జెట్లో వెంటనే కాంట్రాక్టర్లకు నిధులు విడుదల చేసేది ఇప్పుడు ఈ ప్రభుత్వం ఇంతవరకు ఒక్క పైసా కూడా కాంట్రాక్టర్లకు ఇవ్వలేదు మిత్తి కట్టలేక తెలంగాణ రాష్ట్రంలో చాలామంది చిన్న కాంట్రాక్టర్లు మానసికంగా ఒత్తిడికి గురై చాలామంది చనిపోయారు. అయినా ప్రభుత్వానికి కనికరం లేదు ప్రస్తుతం నల్లగొండ జిల్లాలోని సుమారు 50 మంది కి పైన చిన్న కాంట్రాక్టర్లు ఉన్నారు. చిన్నచిన్న కాంట్రాక్టర్లు ఒక్కొక్కరికి 40 లక్షలు 60 లక్షలు పైన రావాల్సి ఉన్నాయి.15 నెలల అవుతుంది. బిల్లులు రాక ఎన్నో సందర్భాలలో హైదరాబాద్ పోయి చీఫ్ ఇంజనీర్ కలిసి మా యొక్క బాధ సాధకాలు విన్నపించాం చూద్దాం చేద్దాం అన్నారే తప్ప మమ్మల్ని ఎవరు పట్టించుకోలేదు మా మీద కనికరం కూడా చూపించలేదు కాంట్రాక్టర్లు మేము చేసిన పనులు ప్రజల కోసం సౌకర్యార్థం చేసిన పనులు నా పేరు ఇరగ దిండ్ల కృష్ణ నేను 22,23లో ఆర్ అండ్ బి డిపార్ట్మెంట్లో 5 లక్షల పనులు చేసిన ఇంతవరకు ఒక్క పైసలు కూడా రాలేదు. మన ఊరు మనబడి సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్లో నాలుగు లక్షల 50 వేలు రూపాయలు పనులు చేసి నా ఒక్క పైసలు రాలే ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ పోలీస్ కార్పొరేషన్ హైదరాబాద్ బషీర్బాగ్ పోలీస్ స్టేషన్ 15 లక్షల రూపాయల వరకు రిపేర్ వర్కు చేసినా 16 నెలల దాటింది ఇంతవరకు పేమెంటు కూడా రాలేదు. మేము చాలా చిన్న కాంట్రాక్టర్ ని ఐదు రూపాయలకు మిత్తి తెచ్చుకొని పనులు చేసిన పబ్లిక్ సౌకర్యార్థం కోసం ప్రజల కోసం చేసిన పనులు అన్ని ఆఫీసులు తిరిగిన ఫలితం లేదు. చూద్దాం చేద్దాం అధికారులు అంటున్నారు. తప్ప నాలాంటి చిన్న కాంట్రాక్టర్ ని నా జీవన ఆధారం 2001 నుండి 2025 ఇప్పటివరకు నా వృత్తి కాంట్రాక్టర్ పనులు తప్ప వేరే ఆధారం ఏమీ లేదు.నాలాంటి చిన్న కాంట్రాక్టర్ ని ఇది డబ్బులు వచ్చేది ఉంటే ఇంతవరకు రాలేదు ఇలా చూసుకుంటూ పోతే జిల్లాలోని సుమారు 50 మంది పైన కోటి రూపాయల లోపల రానివారు ఎంతమంది ఉన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మా యొక్క బిల్లులు కాంట్రాక్టర్లుకు అందరికీ ఒకటో తారీకు లోపల మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరుకుంటున్నాను. మనం విలాసాల కోసం అప్పులు చేస్తాలే ప్రజల సౌకర్యం కల్పించుట కొరకు ప్రభుత్వానికి పెట్టుబడి పెడుతున్నాము.ఈ ప్రయాణంలో అప్పుల పాలు అవుతున్నాము. కాబట్టి ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకొని కాంట్రాక్టర్ ఒకటో తారీకు లోపల కాంట్రాక్టర్లందరికీ బిల్లులు మంజూరు చేయాలి. రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నాను. ఇలాగనే జరుగుతే కాంట్రాక్టర్ల పరిస్థితి దయనీయ స్థితిలో ఉంది కాబట్టి ప్రభుత్వం మా యొక్క బిల్లులను వెంటనే విడుదల చేయాలి.

## మహిళలపై జరిగే అత్యాచారాలు హత్యలు, వేదింపులపై ప్రజల్లో చైతన్యం

**జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 24:**

ఐపిసి యాదాద్రి జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలుగా ఎడవెల్లి సరిత నియామితులైనారు. ఈ మేరకు ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర మహిళా విభాగ అధ్యక్షురాలు ఆకారపు పద్మిని నియయమక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎడవెల్లి సరిత మాట్లాడుతూ.. సమాజం లో మహిళలపై జరిగే అత్యాచారాలు హత్యలు ,వేదింపులు మొదలగు వాటిపై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చే విధంగా అవగాహన సదస్సులు పెడుతూ కార్యాచరణ తో ముందుకు వెళ్లనున్నట్లు తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంపూర్ణ మధ్యపాననిషేధాన్ని అమలుపరచాలని సరిత డిమాండ్ చేశారు. రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు ఆకారము పద్మిని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు కేబీ శ్రీధర్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉదయ లక్ష్మీ మరియు జాతీయ నాయకులకు రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ కోఆర్డినేటర్ సెలవ రాజు ఈ సందర్భంగా సరితకు శుభాకాంక్షలు తెలుపుతూ తమ వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.

## వైశ్య వికాస వేదిక ప్రతిభా పురస్కారాలు 2025



ఇంటర్మీడియట్ 2025 ఫలితాలల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన వైశ్య విద్యార్థిని, విద్యార్థులకు శుభాకాంక్షలు.. వైశ్య వికాస వేదిక లయన్ డా. కాచం సత్యనారాయణ అధ్వర్యంలో ప్రతి సం. నిర్వహిస్తున్న "ప్రతిభా పురస్కారాలు 2025" కార్యక్రమానికి ఇంటర్మీడియట్ 2025లో ప్రథమ, ద్వితీయ సం. (first year or second year) ఫలితాల్లో 95%, అంతకన్నా ఎక్కువ ప్రతిభ కనబరచిన వైశ్య విద్యార్థిని, విద్యార్థుల అప్లికేషన్స్ ఆహ్వానిస్తున్నాము.

**నోట్ :** ప్రతిభా పురస్కారాలు కేవలం తెలంగాణ వైశ్య విద్యార్థిని, విద్యార్థులకు మాత్రమే, ఇతరులు ఎవరు అప్లికేషన్స్ ను పంపించకండి. చివరి తేది: 1005 2025. Please fill your details in the given website link. https://vysyavikasavedika.com

**వివరాలకు.. లయన్ డా. కాచం సత్యనారాయణ,** ఫౌండర్ చైర్మన్ V3 News, విశ్వంభర టీవీ, విశ్వంభర దినపత్రిక, 9441 222 429. మరిన్ని వివరాలకు.. నంగునూరి రమేష్ : 98660 12985.




## దాహం తీర్చేందుకు చలివేంద్రం

✍ జయభేరి, గజ్వేల్, ఏప్రిల్ 24 :

గజ్వేల్ పట్టణంలో తూప్రాన్ రోడ్డు లో సబ్‌స్టేషన్ దగ్గర కేశమైన భాస్కర్ ముదిరాజ్, కేశమైన రాజశేఖర్ ముదిరాజ్, బూపతి సురేష్ ఆధ్వర్యంలో ఎర్పాటు చేసిన చలివేంద్రంను గజ్వేల్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు గుంటుకు శ్రీనివాస్ ముదిరాజ్ ప్రారంబించడం జరిగింది. ఈ సందర్భంగా గుంటుకు శ్రీనివాస్ మాట్లాడుతు కేశమైన బాస్కర్ ఎండకాలంలో ప్రజల దాహర్థి తీర్చడానికి మంచినీరు (మినరల్ వాటర్) ప్రజల ఆరోగ్యానికి ఉపశమనం కలిగించడానికి మజ్జిగ వితరణ కార్యక్రమం చేపట్టరన్నారు. కేశమైన బాస్కర్ టీం గత నాలుగు సంవత్సరాల నుంచి ప్రతి సంవత్సరం చలివేంద్రంను ఎర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డం రాజు, తిరుపతి, సంగుపల్లి బీరయ్య, చుంచు యాదగిరి, వడ్లరాజయ్య, ఎర్రం రాజు, నల్లవెల్లిమహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబనికి అర్ధిక సహాయం

**BRS పార్టీ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వద్త్య రమేష్ నాయక్**



✍ జయభేరి, కొండ మల్లెపల్లి :

కొండమల్లేపల్లి మండలానికి చెందిన నిరుపేద కుటుంబ వివాహానికి తమ వంతు సహాయంగా BRS పార్టీ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వద్త్య రమేష్ నాయక్ 10.000.[పది వేల రూపాయలు] అర్ధిక సహాయం BRS కొండ మల్లె పల్లి మండల అద్యక్షులు రరామావత్ దస్రు నాయక్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో చైతన్య నాయక్, బి ఆర్ ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆంజనేయులు జన్మదిన వేడుకలు



✍ జయభేరి, దేవరకొండ :

దేవరకొండలో బిఆర్ ఎస్ సీనియర్ ఉద్యమకారులు న్యాయవాది గాజుల ఆంజనేయులు జన్మదిన వేడుకలను మాకం చంద్రమౌళి (సీఎం) ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ ఆవరణలో కేక్ కట్ చేసి శాలువ ల తో సన్మానం చేసి వేడుకలు నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ నజీర్, నల్ల గాసు సత్యనారాయణ, మహమ్మద్ ఇలియాస్ పటేల్, రమావత్ రమేష్ నాయక్, గందూరి లక్ష్మణ్, ఎండి రిజ్వాన్, ఎండి బాబా, లక్ష్మీకాంత్, ఎండి అక్రమ్, మాకం సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ కోసం జనం ఎదురుచూస్తున్నారు



✍ జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 24:

భారత రాష్ట్ర సమితి ఫిరాయింపు ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్ కు దాదాపుగా హ్యాండిచ్చేశారు. కేసీఆర్, బీఆర్ఎస్ కు అనుకూలంగా ఆయన మాట్లాడుతున్నారు. భారత రాష్ట్ర సమితి రజతోత్సవ సభ సక్సెస్ అవుతుందని ప్రకటించారు. కేసీఆర్ రాక కోసం జనం ఎదురు చూస్తున్నారని ఆయన అంటున్నారు. బహిరంగసభకు పెద్ద ఎత్తున వస్తారని చెప్పుకొచ్చారు. అదే సమయంలో ఐఏఎస్ స్మితా సభర్వాల్‌కూ ఆయన మద్దతు పలికారు. కంచ గచ్చిబౌలి విషయంలో స్మితా సభర్వాల్ చేసిన పోస్టులో తేడా ఏమీ లేదన్నారు. ప్రభుత్వాన్ని ఉద్దేశించి ఆమె పోస్టు చేయలేదని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ తరపున ఖైరతాబాద్ నుంచి గెలిచిన దానం నాగేందర్ తర్వాత కాంగ్రెస్ లోకి ఫిరాయించారు. ఆ పార్టీ తరపున సికింద్రాబాద్ నుంచి ఎంపీగా పోటీ చేసిన స్వల్ప తేడాతో ఓడిపోయారు. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ తనకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో రివర్స్ అయ్యారు. అనర్హతా వేటు పడితే.. ఒక్క చాన్స్ దానంపైనే ఉంది. ఆయన బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉంటూ.. కాంగ్రెస్ ఎంపీగా పోటీ చేశారు. ఈ విషయంలో ఆయనపై నిర్ణయం తీసుకోవాలని స్పీకర్ పై ఒత్తిడి రావొచ్చన్న అంచనాలు ఉన్నాయి. అయినా ఆయన కాంగ్రెస్ కు దూరంగానే ఉంటున్నారు. కాంగ్రెస్ పార్టీ కొత్త ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు. కానీ ఆయన హాజరు కావడంలేదు. ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లోనూ కనిపించడం లేదు. ఇటీవలి కాలంలో ముఖ్యమంత్రిని కూడా కలవలేదు. పార్టీ వీడేందుకే సిద్ధమయ్యే ఇలా మాట్లడుతున్నారంటూ మరో టాక్ వినిపిస్తోంది. అధికారంలో ఉన్న పార్టీ వీడి మరో పార్టీలోకి వెళ్లడం అనేది సాధారణంగా జరగదు. అదీ పార్టీ మరీ పట్టించుకోవడం లేదు, ఉన్నా ఉపయోగం లేదు అన్న సందర్భంలో తప్ప. ఇప్పుడు దానం విషయంలో అదే జరుగుతోందా అనే అనుమానాలు బలపడుతున్నాయి. ఏదో ఆశించి బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరితే తీరా, ఇక్కడ కూడా లైట్ తీసుకుంటారా.? అనే అసంతృప్తితోనే దానం ఇలా సహనం కోల్పోతున్నారు అనే వాదనలు ఉన్నాయి. ఇప్పుడు దానం నాగేందర్ రాజకీయంగా ఏం నిర్ణయం తీసుకుంటారన్నది కీలకంగా మారింది. మళ్లీ బీఆర్ఎస్‌లోకి వెళ్తే రానిస్తారేమో కానీ.. గతంలోలా ప్రాధాన్యం ఇవ్వరు. గ్రేటర్ ఎన్నికలు దగ్గర పడుతూండటంతో కాంగ్రెస్ పార్టీనే తన డిమాండ్లను నెరవేరుస్తుందని ఆయన నమ్మకంతో బెట్టు చేస్తున్నారన్న అభిప్రాయం వినిపిస్తోంది. అయితే ఆయన పార్టీ కార్యక్రమాలకు రావడం లేదు అని కాంగ్రెస్ కూడా ఫీలవడం లేదు. రాకపోతే పోయారులే అనుకుని లైట్ తీసుకుంటున్నారు. దానం సిఫారసులను కూడా పట్టించుకోవడం లేదు. అందుకే బీఆర్ఎస్ ను పొగుడుతున్నారని అంటున్నారు.

# కేంద్ర ప్రభుత్వానికి ఇది పెద్ద దెబ్బ

- ప్రతిరోజు దేశభక్తి గురించి మాట్లాడే బిజెపి పార్టీ , ప్రధాని మోడీ, హోం మంత్రి అమిత్ షా..
- రాజీనామా చేస్తారా..!?
- ఉగ్రవాద దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి ఏమిచ్చినా వారి రుణము తీర్చలేము..
- గడ్డివాములో ఎలకలను ఏరడం కాదు..
- పాకిస్తాన్ తలకాయనే లేపే ప్రయత్నానికి
- భారత్ శ్రీకారం చుట్టాలి
- ఉగ్రవాదులను ఏరి వారిని కఠినంగా శిక్షిస్తాం అని చెబుతున్న మన ప్రధాని
- ముందు పాకిస్తాన్ ఎలా దెబ్బతీయాలో ఆలోచించాలి
- యుద్ధానికి యుద్ధం సమాధానం కాదు
- శత్రువు యొక్క బలహీనతను తెలుసుకోండి

✍ జయభేరి, హైదరాబాద్ :



ఎప్పుడైతే బిజెపి ప్రభుత్వం కాశ్మీర్ ను భారత్ లో 370 అధికరణ ప్రకారంగా కలిపిందో అప్పటినుంచి ప్రతీకార చర్యకు దిగాలని అనేక రకాలుగా పాకిస్తాన్ ఉగ్రవాద సంస్థలు లష్కరే తోయిబా, జైషే మహమ్మద్ వంటి అనేక సంస్థలు విరామం లేకుండా దాడి చేయాలనే దుర్బుద్ధితో పథకాలు రచిస్తున్నాయి. ఇక తాజాగా ఉగ్ర మూకలు కాశ్మీర్లో అల్లర్లు సృష్టించాలని, అక్కడ నెలకొన్న శాంతిని చెడగొట్టాలని కాశ్మీర్ ను తమ పాకిస్తాన్లో కలుపుకోవాలని విశ్వ ప్రయత్నానికి దిగుతున్నాయి...దానికి నిదర్శనంగా జమ్మూ కాశ్మీర్లోని పహల్గాం సమీపంలో బైనరస్ లోయలో సైనికుల దుస్తులతో వచ్చిన ముష్కరులు అమాయకమైన ప్రజల ప్రాణాలను బలిగొన్నారు.

370 రద్దు తరువాత ఇప్పుడు అక్కడ మారణ హోమం ఎందుకు జరుగుతుంది?

నిజానికి కాశ్మీర్ ను భారత్ లో కలిపిన మన ప్రభుత్వం అప్పటినుంచి, కాశ్మీర్ లో ఉన్న యువత మధ్య తరగతి ప్రజలు ఆర్థికంగా నిలదొక్కు కుంటున్నారు. అంతేకాకుండా ఉపాధి అవకాశాలు ప్రశాంతత అక్కడి వాతావరణం లో నెలకొంది. ఇంకోవైపు పాకిస్తాన్ ఐఎస్ఐ తీవ్రవాద సంస్థలు బంగ్లాదేశ్, చైనతో సంబంధాలు తెగిపోవడం.. ఇంకోవైపు పాకిస్తాన్ అమెరికాకు దూరం కావడం, మరోవైపు ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత అమెరికా చైనాకు అసలు పడకపోవడం చక చక జరిగిపోతూనే ఉన్నాయి.

ఈ నేపథ్యంలో అమెరికాకు భారతదేశానికి మంచి సంబంధాలు ఏర్పాటయ్యాయి. ఇది మింగుడు పడని పాకిస్తాన్ ప్రతీకార చర్యలకు పాల్పడుతుంది.

నిజానికి 2019లో పుల్వామా దాడి తర్వాత అంతటి విషాదాన్ని నింపిన ఈ ఉగ్రదాడి ఇప్పుడు భారతదేశనికి ఒక మాయని మచ్చల పెద్ద అవమానాన్ని తెచ్చిపెట్టింది. దాయాది పాకిస్తాన్ ఎప్పుడు సంఘర్షణతోనే వారి ప్రస్థానం మొదలవుతుంది. పాకిస్తాన్ ఆర్మీ ని అక్కడ ప్రజలు చీదరించుకోవడం, అసహ్యంచుకోవడం మీకు చేతకాకపోతే చావండి అంటూ పాకిస్తాన్ ఆర్మీ పై అనేక ఆరోపణలు పాకిస్తాన్ ఆర్మీ పై రావడం పాకిస్తాన్ ఆర్మీ అవమానంతో కృంగిపోవడం అక్కడ నిత్యం జరుగుతూనే ఉన్నాయి.. అది తట్టుకోలేని ఆర్మీ పాకిస్తాన్ ఎలాగైనా భారతీయులను ఆర్మీ సైనికులను తిప్పి కొట్టడానికి పాకిస్తాన్ ఆర్మీ ఈ ఘాతుకానికి పాల్పడింది.

370 ఆర్టికల్ రద్దు చేసిన తర్వాత జమ్మూ కాశ్మీర్ ప్రాంతంలో ఉపాధి పెరగడం అక్కడ ప్రశాంతత ఏర్పడడం మింగుడు పడని పాకిస్తాన్ 20, 30 ఏళ్లుగా పాకిస్తాన్ ఎలాగైన కాశ్మీర్ ను తమలో కలుపుకోవాలని వల పన్నుతూనే వస్తోంది. అందుకే పెహెల్గాం లో జరిగిన ఉగ్రదాడి లో హిందువులు ఎవరు? క్రిస్టియన్స్ ఎవరు ఇక్కడికి రాకూడదు అంటూ మరి అడిగి కాల్చి చంపిన దాఖలాలను మనం చూస్తున్న ం... భారతదేశంలో మత ఉద్దేశాలు రెచ్చగొట్టింది ఇక్కడి ప్రభుత్వం కాదా? ఇది ఈ ఘాతుకానికి ప్రాణం పోసిందంటే బిజెపి ప్రభుత్వం ఏం చెప్తుంది? ఇంకవైపు కాశ్మీర్లో ప్రజా ప్రభుత్వం ఏర్పడం ఒకవైపు ఉంటే ప్రధాని మోడీ ప్రమాణ స్వీకారం రోజునే అక్కడి వైష్ణవి అమ్మవారి దేవాలయంలో వైష్ణవులను ఉగ్రవాదులు చంపడం జరిగింది. అంటే పాకిస్తాన్ ఉగ్రవాద సంస్థలు తమ ఉనికిని కాపాడుకోవడానికి ఇదే అదునుగా భావించి వేటు వేశారు.

*ఎంత కాలం ఉన్నా వందల సంవత్సరాలైనా సరే మేము మేమే... మీరు మీరే... ఎప్పటికీ మనం కలవ కూడదు... కాశ్మీర్ పాకిస్తాన్లో భాగమే అనే విధంగా పాకిస్తాన్ ఆర్మీ దృశ్చర్యలకు పాల్పడుతుంది.*


ఒకవైపు కాశ్మీర్లో పండిట్లను ఊతకోత పోసిన ఉగ్రవాద సంస్థలు ఈసారి ఎండాకాలం టూరిస్టులను టార్గెట్ చేసుకొని పథకం ప్రకారం లోకల్ ఉగ్రవాదులతో చేయి కలిపి ఒక పదునైన ఉపాయంతో ఈ ఘాతకానికి పాల్పడింది.

370 ఆర్టికల్ రద్దయిన తర్వాత కాశ్మీర్లో ఆర్థికంగా బలపడడంతో ఉగ్రవాద సంస్థలకు ఎలాంటి అవకాశం లేకపోయింది. నిజానికి ఉగ్రవాదులు ఉగ్రవాదం వైపు యువతను మలించడానికి కాశ్మీర్లో గతంలో ఆర్థిక భారం పేదరికం సమస్యలు అక్కడి ప్రజల కుటుంబ ఆర్థిక పరిస్థితి సరిగ్గా లేకపోవడం వల్ల ఇదే అధనుగా తీసుకున్న కాశ్మీరీ ఉగ్రవాద సంస్థలు ఆర్మీ పూర్తిగా యువతను తమ వైపు మళ్ళించుకునేలా వారికి అనేక రకాలుగా తాయిలాలు అందించి యువతను ఉగ్రవాద సంస్థకు దగ్గరగా చేర్చేవారు.. కానీ ఇప్పుడు అలా లేదు కాశ్మీర్ పూర్తిగా మారిపోయింది ప్రజాస్వామ్యమైన పాలనలో ఆర్థికంగా బలపడ్డ అక్కడ యువత ఉపాధి అవకాశాలతో ప్రశాంతంగా ఉంటున్నారు. ఇది మింగుడు పడని పాకిస్తాన్ ఉగ్రవాద సంస్థలతో పాటు ఆర్మీ కూడా ఎలాగైనా ప్రతీకారం తీర్చుకోవాలని ఉద్దేశంతో అక్కడ పరిసర ప్రాంతంలో నివసించే వారిని అంటే లోకల్ గా నివసించే వారిని ప్రేరేపించి ఒక మేనిఫెస్టో ద్వారా ఇలాంటి దాడి చేశారనేది చేశారు.. ఎందుకంటే లోకల్ గా యువత సపోర్టు లేనిదే ఇంతటి ఘాతుకానికి పాల్పడడం చాలా కష్టం. ఇక ఇంటలిజెన్స్ వైఫల్యం గురించి ఆలోచిస్తే ఎల్ వోసి నుండి లడక్ మీదుగా పెహల్గా వెళ్లాల్సి ఉంటుంది దక్షిణాన అనంత నాగు మధ్యలో ఈ దారి ఉంది కాబట్టి అక్కడ ఎంత ఇంటలిజెన్స్ నెట్వర్క్ పెట్టిన కూడా ఇంటలిజెన్స్ విభాగం పూర్తిగా చేతులెత్తేసింది. అంటే అక్కడ సైనిక బలం తక్కువగా ఉందని మనకు అర్థం అవుతుంది. గత పదివేలుగా మోడీ ప్రభుత్వం ఆర్మీ సైనికులను రిక్రూట్మెంట్ చేయనేలేదు. ఇది ఆర్మీ మాజీ సైనికులు అధికారులు చెబితేనే గాని మనకు తెలియదు. అందుకే ఉగ్రవాదులు లోకల్ గా ఉన్న వారిని ఎంచుకొని సైనిక దుస్తులు వారికి అందించి జనంలో కలిసిపోయేట్టుగా చేశారు. ఇది ముమ్మాటికీ పాకిస్తాన్ ఉగ్రవాద సంస్థలతో పాటు ఆరోపణలు ఎదుర్కొంటున్న పాకిస్తాన్ ఆర్మీ భాగస్వామ్యం కూడా ఉంది. తెలివిగా ప్లాన్ తో ఏ సెక్టార్ లో ఎంతమంది ఉన్నారు? అనే విషయాలు ఎప్పటికప్పుడు తెలుసుకొని ఎంతమందిని అంతం చేయొచ్చు? అనే పక్కా ఉపాయంతో పథక రచనలు చేసుకున్నారు. ఉగ్రవాదులు సైనిక దుస్తుల్లో ఉన్న నిఘా సంస్థలం వైఫల్యం కచ్చితంగా ఉంది.

గతంలో ఆర్మీలో ఉన్నత స్థాయి అధికారులుగా పని చేసిన వారు చెప్పే మాటలను బట్టి చూస్తే గత ఐదు సంవత్సరాల నుంచి భారత ఆర్మీ లో యువతను చేర్చుకోకపోవడం పెద్ద తప్పుగా కనిపిస్తోంది...

ఒక ఆర్మీ మాజీ సైనిక అధికారి తమ అనుభవాన్ని సోషల్ మీడియాలో చెబుతూ ఆ రోజు ప్రధానమంత్రి మోడీ నన్ను మౌనంగా ఉండమని ఏం మాట్లాడొద్దని చెప్పాడు. అనే విషయాలు కూడా ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అంటే బీజేపీ ప్రభుత్వం కావాలని బార్డర్లో ఆర్మీ జవాన్లను నియమించకపోవడం ఒకరకంగా ఉగ్రవాదులకు అవకాశంగా మారింది. వాస్తవానికి ఉగ్రవాదులు దాడి చేయాలంటే గతంలో లోకల్ ట్రైన్లలో ప్రయాణిస్తూ అలా వాళ్ల ఉగ్ర దాడికి ఉపాయాలు పన్నుకునేవారు. కానీ కాలాలు మారుతున్న తరంలో ఉగ్రవాదుల ఆలోచనలు కూడా మారిపోయి టెలిఫోన్ ద్వారా ఇంటర్నెట్ సౌకర్యాన్ని వినియోగిస్తూ లొకేషన్ ట్రేస్ చేస్తూ కొంతకాలం ఉగ్రవాదుల పన్నాగాలను రచించుకున్నారు. కానీ ఇప్పుడు అధునాతన సాంకేతిక పరమైన ట్రాకింగ్ పరికరాలను వాడుకుంటూ కమ్యూనికేషన్ డివైస్లను ఏర్పాటు చేసుకొని పాశవిక దాడులకు దిగుతుంది పాకిస్తాన్...

లోకల్ గా ఉన్న యువత సహాయంతో దిగిన ఉగ్రవాద సంస్థలు ఎండాకాలంలో ఇక్కడి ప్రదేశానికి టూరిస్టులు దాదాపు 50 నుంచి 60 శాతం వస్తారు. అనే ఒక అంచనాకు వచ్చి పక్క పథక రచన చేసుకున్నారు. బైసరంగ్ వ్యాలీ లో రోడ్డు సగం వరకే మంచి రహదారి ఉంటుంది. ఆ తర్వాత ఫుట్ రోడ్డు ఉండడం వల్ల అక్కడి ప్రజలు గుర్రాలపై వెళ్లాల్సి ఉంటుంది. అందుకని ఉగ్రవాదులు స్థానికుల సహాయ సహకారాలతోనే పూర్తిగా జల్లెడ పట్టి కాశ్మీర్లో చొరబాట్ల దారులను ఏగ దోస్తు శక్తులను




ఏర్పాటు చేసుకున్నారు,మరియు పాకిస్తాన్ ఉగ్రవాద సంస్థలు. నిజానికి 600 మంది ఏడు వందల మంది మిలిటెంట్లు ఒకప్పుడు కాశ్మీర్లో ఉండేవి. ఉగ్రవాద సంస్థలు అక్కడ పని చేసేవి. కాశ్మీర్లో ప్రజాస్వామ్యం ఏర్పడిన తరువాత ఉగ్రవాదం అక్కడ తగ్గిపోయి. చాలావరకు అంటే 100 నుంచి 150 వరకు బ్రిగేడ్ ఏరియాలలో 10 12 మంది ఉగ్రవాదులు ఉన్నట్టుగా అంచనా. అంటే కాశ్మీర్లో ప్రశాంత ప్రజాస్వామ్యం ఏర్పడి అక్కడ ప్రజలు ఆర్థికంగా స్థిరపడిపోతున్న తరుణంలో ఉపాధిలో కూడా ముందున్న నేపథ్యంలో ఉగ్రవాదులు లోకల్ సపోర్ట్ తీసుకుని ఈ ఘాతుకానికి పాల్పడ్డారు. ఇక దీనిని అనేకమంది సోషల్ మీడియాలో ఇది ప్రభుత్వము వైఫల్యం యుద్ధం చేయాల్సిందే అని అనేక రకమైన సలహాలు సూచనలు ఇస్తున్నారు.. నిజానికి యుద్ధం చేయడం అనేది చివరి ప్రయత్నం. ముందు మనం గడ్డివాములో సూది వెతకడం మానేయాలి. తలకాయలను లేపేసే ప్రయత్నాన్ని మనం ఆలోచించాలి. శత్రువు యొక్క బలహీనతను పసిగట్టాలి. ఎలా పాకిస్తాన్ ను ముక్కలు ముక్కలుగా చేయాలో ఆలోచించాలి.



✍ కడారి శ్రీనివాస్
సీనియర్ జర్నలిస్ట్ (జయభేరి),
తెలంగాణ రాష్ట్ర ఉత్తమ ఎడిటోరియల్ జర్నలిస్ట్ అవార్డు గ్రహీత

**ప్రధాన ఆయుధం మన శత్రువైన పాకిస్తాన్ ను ముక్కలుగా చేయాలి అంటే పాకిస్తాన్లో ఉన్న బలుచిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ 30, 40 ఏళ్ల నుంచి పాకిస్తాన్ కు పక్కలో బల్లిండ్ల మారుతుంది. ఎందుకంటే బలుచిస్తాన్ కానీ ఆఫ్ఘనిస్తాన్ కానీ రెండు వేరే దేశాలుగా ఏర్పడాలని ఏర్పాటు వాదాన్ని గత కొంతకాలంగా బలంగా వినిపిస్తున్నాయి. ఇలాంటి తరుణంలో పాకిస్తాన్ ను ముక్కలుగా చేయాలన్న శత్రువులు ఇబ్బంది పెట్టాలన్న వందకి 100% ఈ అవకాశాన్ని మనం వినియోగించుకోవాలి. ఎందుకంటే పాకిస్తాన్ భారతదేశం రెండు దేశాలు న్యూక్లియర్ దేశాలుగా మారిపోయాయి. ఇలాంటి చక్కని అవకాశాన్ని పాకిస్తాన్ని ముక్కలుగా చేయడానికి మొట్టమొదలు చేయాల్సిన పని. బలుచిస్తాన్ ఏర్పాటు వాదాన్ని అవకాశం గా తీసుకోవాలి. అలాగే ఆఫ్ఘనిస్తాన్ ఏర్పాటు వాదాన్ని కూడా అవకాశంగా మలుచుకొని మిలటరీ యాక్షన్ ని బలోపేతం చేసుకోవాలి. వీరితోపాటు సర్జికల్ స్ట్రైక్ ఎప్పటికప్పుడు ఎనలైజ్ చేసుకుంటూ ప్రధాన శత్రువైన ఉగ్రవాద సంస్థల ను పెంచి పోషిస్తున్న పాకిస్తాన్ ఆర్మీతో పాటు జైషే మహమ్మద్ లష్కరితోయిబా వంటి అనేక ఉగ్రవాద పాకిస్తాన్ మిలటరీ బలాన్ని పాకిస్తాన్ని ముక్కలుగా చేయడానికి ఇదొక మంచి అవకాశంగా భారత ప్రభుత్వం గుర్తించాలి.**

అంతేకానీ యుద్ధానికి యుద్ధం అది మంచి పద్ధతి కాదు. గతంలో మాజీ ప్రధాని వీపీ సింగ్ ఒక మాట అన్నది గుర్తుకు వస్తోంది.. ఒక్కసారి కాదు వంద సార్లు కాదు వెయ్యి సార్లు యుద్ధం చేసిన గుంటెడు జాగా కూడా మీరు తీసుకోలేరు. అని ఆనాటి ప్రధాని పాకిస్తాన్ కి చురకలు వేశారు. వాస్తవానికి యుద్ధం అనేది చివరి ప్రయత్నం. తప్పదు అనుకుంటే అది చేయాల్సిందే. ఇకపోతే పాకిస్థాన్ కు దెబ్బ తీయాలంటే ముఖ్యంగా వాణిజ్య రంగంలో అది ఇప్పటికే పూర్తిగా దెబ్బతినిపోయింది. అలాగే బంగ్లాదేశ్ కూడా పాకిస్తాన్ కు సహాయం చేయడం లేదు.. ఎందుకంటే అమెరికా ఒత్తిడి ఎక్కువగా ఉంది. ఇంకోవైపు బంగ్లాదేశ్ లో కూడా ఆర్థిక పరిస్థితి వాణిజ్య వ్యాపారాలు కూడా బాగా దెబ్బతిన్నాయి.. ఇలాంటి సమయంలో పాకిస్తాన్ 40, 50 సంవత్సరాల నుండి మన భారతదేశం నుండి మెడికల్ గా మనం పాకిస్థాన్ కు సహాయపడుతున్న.. వెంటనే ఈ పద్ధతిని భారతదేశం మానుకోవాలి. ప్రధానమంత్రి మోడీ పదేపదే చెబుతున్న పాకిస్తాన్ కు మాత్రం మెడికల్ కు సహాయ సహకారాలు పాకిస్తాన్ కు అందిస్తున్నారు.

ఇకపోతే ప్రధాన ఆయుధం మన శత్రువైన పాకిస్తాన్ ను ముక్కలుగా చేయాలి అంటే పాకిస్తాన్లో ఉన్న బలుచిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ 30, 40 ఏళ్ల నుంచి పాకిస్తాన్ కు పక్కలో బల్లిండ్ల మారుతుంది. ఎందుకంటే బలుచిస్తాన్ కానీ ఆఫ్ఘనిస్తాన్ కానీ రెండు వేరే దేశాలుగా ఏర్పడాలని ఏర్పాటు వాదాన్ని గత కొంతకాలంగా బలంగా వినిపిస్తున్నాయి. ఇలాంటి తరుణంలో పాకిస్తాన్ ను ముక్కలుగా చేయాలన్న శత్రువులు ఇబ్బంది పెట్టాలన్న వందకి 100% ఈ అవకాశాన్ని మనం వినియోగించుకోవాలి. ఎందుకంటే పాకిస్తాన్ భారతదేశం రెండు దేశాలు న్యూక్లియర్ దేశాలుగా మారిపోయాయి. ఇలాంటి చక్కని అవకాశాన్ని పాకిస్తాన్ని ముక్కలుగా చేయడానికి మొట్టమొదలు చేయాల్సిన పని. బలుచిస్తాన్ ఏర్పాటు వాదాన్ని అవకాశం గా తీసుకోవాలి. అలాగే ఆఫ్ఘనిస్తాన్ ఏర్పాటు వాదాన్ని కూడా అవకాశంగా మలుచుకొని మిలటరీ యాక్షన్ ని బలోపేతం చేసుకోవాలి. వీరితోపాటు సర్జికల్ స్ట్రైక్ ఎప్పటికప్పుడు ఎనలైజ్ చేసుకుంటూ ప్రధాన శత్రువైన ఉగ్రవాద సంస్థల ను పెంచి పోషిస్తున్న పాకిస్తాన్ ఆర్మీతో పాటు జైషే మహమ్మద్ లష్కరితోయిబా వంటి అనేక ఉగ్రవాద పాకిస్తాన్ మిలటరీ బలాన్ని పాకిస్తాన్ని ముక్కలుగా చేయడానికి ఇదొక మంచి అవకాశంగా భారత ప్రభుత్వం గుర్తించాలి.

గతంలో కూడా పాకిస్థాన్ అధ్యక్షుడిగా ఉన్న ముషారఫ్ ఇప్పుడు మసీద్ మున్నల్... ఇలా ప్రధానులు ఎవరైనా సరే వాళ్ళ మస్తిష్కంలోనే దుర్బుద్ధి దాగి ఉంది. కనుక బంగ్లాదేశ్ ఇప్పటికే అనేక సమస్యలతో ఆర్థిక భారంతో కుదేలై పోతుంది.

కాబట్టి దాన్ని పక్కనపెట్టి చిరకాల శత్రువు అయిన పాకిస్తాన్ ని ముక్కలుగా విడగొట్టడానికి అక్కడ ఉన్న బలుచిస్తాన్ ఆఫ్ఘనిస్తాన్ ఏర్పాటు వాదాన్ని అవకాశంగా మలుచుకోవాలి...ఇకపోతే సోషల్ మీడియాలో వస్తున్న అనేక విషయాలని ఆర్మీలో పనిచేస్తున్న ఉన్నత అధికారుల అనుభవాలని పరిగణలోకి తీసుకొని భారత ప్రభుత్వం ఇప్పటికైనా దేశ రక్షణలో ఎలాంటి రాజకీయ ఉద్దేశాలు లేకుండా కుల మతాలు చూడకుండా భారత ఆర్మీలో ఆర్మీ జవాన్లను అధికంగా ఉద్యోగ అవకాశాలు కల్పించి దేశ రక్షణకు నడుం కట్టాలి... బిజెపి ప్రభుత్వం ఇప్పటికే దేశభక్తి పేరుతో జై భారత మాత అంటూ దేశభక్తిని చాటుకుంటూ యువతను తమ వైపు తిప్పుకుంటూ ఉన్న తరుణంలో మరి దేశ రక్షణలో ఆర్మీలో ఎందుకు యువతను చేర్చడం లేదు? అన్న వైపు కూడా యువత ఆలోచించాలి..... ప్రతి సమస్యకి యుద్ధాలే పరిష్కారం కావు.. శత్రువు యొక్క బలహీనతను తెలుసుకొని పాకిస్తాన్ ను ముక్కలు ముక్కలు చేయాలి. అంతేకానీ గడ్డివాములో ఎలకలను పట్టుకున్నట్టుగా భారత ప్రభుత్వం తీసుకునే చర్యలు మానుకోవాలి.. బిజెపి ప్రభుత్వం తీసుకున్న చర్యలకు బలి పశువులుగా మారిపోయిన భారత టూరిస్టులు వారి ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చింది. దీనికి ప్రధాన కారణం కేంద్ర ప్రభుత్వం. రాజీనామా చేయాలి అని కొందరు డిమాండ్ చేస్తున్న. భారత ప్రధాని మాత్రం వారిని ఎక్కడ ఉన్న ఉగ్రవాదులను ఏరి మతమారుస్తాం అని చెప్పడం ఎంతవరకు కరెక్ట్... వారిని చంపడం కాదు పాకిస్తాన్ ని పూర్తిగా దెబ్బ తీసే అవకాశాన్ని తెలుసుకొని నామరూప లేకుండా చేస్తే మంచిది అని మేధావి వర్గం భావిస్తుంది.




## రాజా సాబ్ క్రేజీ అప్‌డేట్ లోడింగ్..

కల్కి చిత్రం తర్వాత ప్రభాస్ నుండి మరే చిత్రం రాలేదు. ఇప్పుడు ఫ్యాన్స్ అంతా కూడా డార్లింగ్ నటిస్తున్న రాజా సాబ్ చిత్రం కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ సినిమా చాన్నాళ్లుగా షూటింగ్ జరుపుకుంటుంది. అదుగో వస్తుంది, ఇదిగో వస్తుంది అని ఊరిస్తున్నారే తప్ప మూవీకి సంబంధించి అప్‌డేట్ కూడా ఇవ్వడం లేదు. అయితే ప్రభాస్ అభిమానుల సహనానికి పరీక్ష పెడుతూ వచ్చిన మేకర్స్ ఎట్టకేలకి ప్రమోషన్స్ పరంగా ఒక అడుగు ముందుకేసినట్టు తెలుస్తుంది. ఇప్పుడు టీజర్ రెడీ చేసే పనుల్లో బిజీగా ఉన్నారట. తమన్ రీ రికార్డింగ్ మొదలు పెట్టేశాడు. మే నెల మధ్యలో టీజర్ లాంచ్ ఉంటుందని తెలుస్తుంది. అయితే టీజర్‌తో పాటు రిలీజ్ డేట్ కూడా అనౌన్స్ చేస్తారా లేదా అనేది సందేహంగా మారింది. ప్రస్తుతానికి డేట్ లేకుండా వీడియో సిద్ధం చేస్తున్నారని, ప్రభాస్ త్వరగా తన బ్యాలెన్స్ షూటింగ్ కంప్లీట్ చేస్తే రిలీజ్ డేట్ అనౌన్స్ చేసే అవకాశం ఉంది. లేదంటూ కమింగ్ సూన్ అనే వేస్తారు. ప్రభాస్ తిరిగి వచ్చి బ్యాలన్స్ షూట్ కు సంబంధించిన కాల్ షీట్ల క్లారిటీ ఇస్తే అందులో పొందుపరుస్తారని, లేదంటే కమింగ్ సూన్ తప్ప ఇంకేం ఉండదని అంటున్నారు. ముందుగా ఏప్రిల్ 10న రిలీజ్ చేస్తామని ప్రకటించారు కానీ, అన్నీ అనుకున్నట్లు జరగకపోవడంతో సినిమాని వాయిదా వేశారు. అయితే త్వరలో విడుదల కానున్న టీజర్ లో అదిరిపోయే కంటెంట్, విజువల్స్, వింటేజ్ ప్రభాస్ లుక్స్ అన్ని చూపించి ఫ్యాన్స్‌కి మంచి ట్రీట్ ఇవ్వబోతున్నాడట మారుతి. అయితే 2025 ప్రధానమైన డేట్లన్నీ ఒక్కొక్కరుగా బ్లాక్ చేసుకుంటూ పోతుండగా, రాజాసాబ్ ఏ డేట్ లాక్ చేస్తాడా అని మిగతా నిర్మాతలు కూడా అయోమయంలో ఉన్నారు. రాజాసాబ్‌కి పోటీగా దిగితే చిన్న సినిమాలు నష్టపోతాయి. అందుకే ఈ మూవీ రిలీజ్ డేట్ త్వరగా అనౌన్స్ చేస్తే మిగతా నిర్మాతలు వారి సినిమాలని కూడా హ్యాపీగా అనౌన్స్ చేసుకునే అవకాశం ఉంది. మే వరకు వేచి చూస్తే ఏదో ఒక క్లారిటీ అయితే వస్తుంది. రాజా సాబ్ లో మాళవిక మోహనన్, నిధి అగర్వాల్ హీరోయిన్లుగా నటించారు. సంజయ్ దత్ ఓ ప్రధాన పాత్ర పోషించాడు.

## భారత్‌లో 'అబీర్ గులాల్' బ్యాన్?



కశ్మీర్ పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్‌కు చెందిన నటీనటులను భారతీయ సినిమాల్లో తీసుకోవద్దని, వారు నటించే సినిమాలను బ్యాన్ చేయాలని సోషల్‌మీడియాలో నెటిజన్లు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ నటుడు ఫవాద్‌ఖాన్, వాణీకపూర్ జంటగా నటించిన 'అబీర్ గులాల్' చిత్రాన్ని బాయ్‌కాట్ చేయాలని సోషల్‌మీడియాలో భారీ ఎత్తున పోస్ట్‌లు పెడుతున్నారు. మే 9న ఈ సినిమాను విడుదల కానుంది. ఇప్పటికే ప్రచార పర్వాన్ని మొదలు పెట్టారు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో ఈ సినిమా రిలీజ్‌ను అడ్డుకోవాలనే డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. ఆర్తీ ఎస్ బగ్డీ దర్శకత్వం వహించిన ఈ సినిమాపై నిర్మాణం నుంచే విమర్శలొస్తున్నాయి. ఓ పాకిస్థాన్ నటుడిని హీరోగా ఎందుకు తీసుకోవాల్సి వచ్చిందని సోషల్‌మీడియా వేదికగా చాలా మంది అభ్యంతరం వ్యక్తం చేశారు. ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియా సినీ ఎంప్లాయిస్ (ఎఫ్‌డబ్ల్యూసీఈ) సైతం పాకిస్థాన్ నటులను అడ్డుకుంటామని, 'అబీర్ గులాల్' రిలీజ్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నది. మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన పార్టీ సైతం ఈ సినిమా విడుదలను అడ్డుకుంటామని గతంలోనే హెచ్చరించింది. తాజా పరిణామాల నేపథ్యంలో భారత ప్రభుత్వం ఈ సినిమాపై నిషేధం విధించే అవకాశాలున్నాయని జాతీయ మీడియాలో వార్తలొస్తున్నాయి. ఉగ్రదాడి అనంతరం యూట్యూబ్ ఇండియాలో ఈ సినిమా పాటలను తొలగించారు.



## తెల్ల చీరలో అందాల సెగలు..

నటి వితికా షేర్ గురించి ఎంత చెప్పినా తక్కువే. అందం, అభినయం ఈ బ్యూటీ సొంతం. ఈ మధ్య వరస ఫొటో షూట్‌తో కుర్రకారుకు పిచ్చెక్కిస్తుంది ఈ చిన్నది. తాజాగా తెల్ల చీరలో తన వయ్యారాలతో.. ఒంపు సొంపులతో సెగలు పుట్టిస్తుంది. వితికా ఝుమ్మందినాదం, భీమిలీ కబడ్డీ జట్టు, ఈమె, ప్రేమించు రోజుల్లో, మైనేమ్ ఈజ్ అమృత వంట వంటి పలు చిత్రాల్లో నటిచి మంచి గుర్తింపు తెచ్చుకుంది. తర్వాత టాలీవుడ్ యంగ్ హీరో వరుణ్ తేజ్‌ను ప్రేమించి పెళ్లి చేసుకుంది. వివాహం అయిన తర్వాత వీరు చాలా రోజుల పాటు చిత్ర పరిశ్రమకు దూరంగా ఉన్నారు. తర్వాత బిగ్ బాస్ ద్వారా మళ్లీ తెలుగు ప్రేక్షకులను పలకరించారు. తెలుగు రియాల్టీ షో బిగ్ బాస్ హౌస్ లోకి అడుగు పెట్టి,తమ ఆటతీరుతో అభిమానుల మనసు గెలుచుకున్నారు. బిగ్ బాస్ తర్వాత ఇద్దరికీ పలు చిత్రల్లో అవకాశాలు కూడా వచ్చినట్లు సమాచారం. ఇక ఎప్పుడూ సోషల్ మీడియాలో ఫుల్ యాక్టివ్ గా ఉండే ముద్దుగుమ్మ వితికా ఎప్పటికప్పుడు తన గ్లామర్ తో కుర్రకారును ఆకట్టుకుంటుంది. తాజాగా తెల్ల చీరలో పలు ఫొటోలకు ఫోజులిచ్చింది. అందులో ఈ ముద్దుగుమ్మ చూడటానికి చాలా గ్లామరస్ గా కనిపిస్తుంది. ప్రస్తుతం ఈ ఫొటోలునెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.



## సొగసు చూడతరమా..

నటి సురేఖ కూతురు సుప్రిత గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఎప్పుడూ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటూ తన అందంతో రచ్చ చేసే ఈ ముద్దుగుమ్మ తాజాగా బీచ్ లో తన అందాలతో రచ్చ చేస్తుంది. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. సీనియర్ నటిసురేఖ గురించి స్పెషల్ గా చెప్పాల్సిన పని లేదు. ఈమె ఎన్నో సినిమాల్లో క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా పని చేసి మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఈ నటికి సుప్రిత అనే కూతురు కూడా ఉంది. వీరిద్దరు కలిసి ఎన్నో పార్టీలు ఎంజాయ్ చేస్తారు. అంతే కాకుండా దానికి సంబంధించిన ఫొటోలు షేర్ చేస్తూ.. సోషల్ మీడియాలో మంచి ఫేమ్ సంపాదించుకున్నారు. దీంతో సురేఖ వాణి కూతురుగా సుప్రిత కూడా తెలుగు అభిమానులకు పరిచయమైంది. అంతే కాకుండా ఈ బ్యూటీ కూడా త్వరలో చిత్రపరిశ్రమలోకి ఎంట్రీ ఇవ్వబోతుందంటూ అనేక వార్తలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతుంటాయి. ఇక సుప్రిత ఎప్పుడూ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటూ తన అందం, గ్లామర్ తో రచ్చ చేస్తుంది. ఈ ముద్దుగుమ్మకు కూడా స్టార్ హీరోయిన్ల రేంజ్ లో మంచి ఫ్యాన్ బేస్ ఉంటుంది. వరసగా రీల్స్, ఫొటో షూట్స్ తో మంచి ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది ఈ ముద్దుగ్మ. ఇక తాజాగా ఈ అమ్మడు బీచ్ లో ఎంజాయ్ చేసిన ఫొటోలు సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఇందులో ఈ ముద్దుగుమ్మ అందానికి ఎవ్వరైనా సరే ఫిదా అవ్వాల్సిందే. బ్లాక్ కలర్ ట్రెండీ డ్రెస్ లో తన అందాలను ఒలుకబోస్తూ ఫొటోలకు ఫోజులిచ్చింది. ఆ వెన్నెలను చూస్తూ.. తన అందాలతో మాయ చేసింది. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. మరి మీరు కూడా ఆఫొటోస్ పై ఓలుక్ వయండి.




## అద్భుతం చేయలేకపోయిన పుష్ప2.. తేడా ఎక్కడ జరిగింది..!

పుష్ప చిత్రంతో ఐకాన్ స్టార్‌గా మారిన అల్లు అర్జున్ ఆ తర్వాత పుష్ప 2తో గ్లోబల్ స్టార్‌గా మారాడు. పుష్ప 2 చిత్రం అల్లు అర్జున్‌సుకుమార్ కాంబోలో తెరకెక్కి సంచలనం క్రియేట్ చేసింది. భారీ అంచనాలతో డిసెంబర్ 5న విడుదలైన ఈ సినిమా తొలి రోజు రూ. 294కోట్ల ఓపెనింగ్స్ అందుకుంది. బాక్సాఫీస్ దగ్గర రూ. 1850 కోట్లను వసూలు చేసి నయా రికార్డులను క్రియేట్ చేసింది. ఇండియన్ బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్‌గా తెరకెక్కిన ఈ చిత్రం శాటిలైట్ ఛానల్ లో ప్రీమియర్ అవుతున్నప్పుడు భారీ రేటింగ్స్ వస్తాయని అందరు అనుకున్నారు. ఇక టీమ్ కూడా విస్తృతంగా ప్రమోషన్స్ చేసింది. సుకుమార్, దేవిశ్రీప్రసాద్ తదితరుల ప్రత్యేక ఇంటర్వ్యూ ఫుటేజ్ తీసుకుని ప్రసారం మధ్యలో వాటిని వదిలారు. అయితే ఎన్ని చేసిన కూడా పుష్ప 2 చిత్రం ప్రభంజనం సృష్టించలేకపోయింది. ఊహించిన దాని కన్నా కొంచెం అటు ఇటు రీచ్ అయ్యి అభిమానులకు, టీవీ వర్గాలకు పుష్ప 2 ఊహించని షాక్ ఇచ్చింది. రిపోర్ట్స్ ప్రకారం పుష్ప 2 ది రూల్ కు వచ్చిన టిఆర్పీ 12.61 మాత్రమే. ఇది మంచి నెంబరే అయిన బాక్సాఫీస్ దగ్గర సృష్టించిన ఫలితంతో పోలిస్తే చాలా తక్కువే. గతంలో బన్నీ నటించిన అల వైకుంఠపురములో (29.4), పుష్ప ది రైజ్ (22.5), డీజే దువ్వాడ జగన్నాథం (21.7) బన్నీ చిత్రాల్లో అగ్ర స్థానంలో ఉండగా సూపర్ ఫ్లాప్ గా నిలిచిన నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా (12.5) కి దగ్గరగా పుష్ప 2 నెంబర్ నమోదు కావడం ఇప్పుడు అందరిని ఆశ్చర్యపరుస్తుంది. అయితే పుష్ప 2 ప్రీమియర్ సమయంలో సంక్రాంతికి వస్తున్నాం రెండోసారి జీ ఛానల్ లో రావడం కొంత ఎఫెక్ట్ చూపించింది. మరోవైపు ఓటిటిలు వచ్చాక మునుపటిలా కొత్త సినిమాలు టీవీలో అదే పనిగా చూడడానికి ప్రేక్షకులు ఆసక్తి చూపడం లేదు. మరోవైపు సినిమా రిలీజ్ అయిన రోజే పైరసీ ప్రింట్ బయటకి వచ్చేస్తుంది. అక్కడే అందరు చూస్తున్నారు. అందుకే టీఆర్పీ తగ్గుతుంది. ఇలా అయితే భవిష్యత్తులో శాటిలైట్ హక్కుల డిమాండ్ మరింత కిందకు పడిపోయే అవకాశం లేకపోలేదు.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com